



నిండ్ర ఎస్టీకాలనీలో సర్వేని పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ పద్మనాభం

సొంతింటిపై కొంగొత్త ఆశలు

- టీడీపీ హయాంలో నిర్మించుకున్నవారి బిల్లుల్ని ఆపిన వైసీపీ సర్కారు
- బిల్లుల మంజూరుకు ప్రస్తుత ప్రభుత్వం ముందడుగు
- ఎన్టీఆర్ గృహ లబ్ధిదారుల్ని గుర్తించే పనిలో హౌసింగ్ అధికారులు

చిత్తూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): 2014-19 మధ్యకాలంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ఎన్టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణ పథకాన్ని అమలు చేసింది. అప్పట్లోనే ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.2.50 లక్షలు యూనిట్ కాస్ట్‌గా మంజూరు చేసి 2019 వరకు బిల్లుల్ని కూడా మంజూరు చేసింది. టీడీపీ హయాంలో నిర్మాణాలు చేపట్టి, బిల్లులు మంజూరు కాని లబ్ధిదారులకు.. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఉద్దేశపూరితంగా బిల్లుల్ని ఆపేసింది. చిత్తూరు జిల్లాలో 29,093 మంది లబ్ధిదారులకు రూ.47.19 కోట్లు, తిరుపతి జిల్లాలో 23,484మంది లబ్ధిదారులకు రూ.39.06 కోట్లను నిలిపేసింది. అప్పులు చేసి నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులు బిల్లులు రాకపోవడంతో నష్టపోయారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వారిలో ఆశలు చిగురించాయి.పాత బిల్లుల్ని మంజూరు చేసేందుకు ఎన్టీఆర్ గృహ లబ్ధిదారుల్ని గుర్తించే పనిలో హౌసింగ్ అధికారులు ఉన్నారు. ఎన్టీఆర్ వెరిఫికేషన్ యాప్ ద్వారా చేస్తున్న ఈ సర్వే చిత్తూరు జిల్లాలో గురువారంతో పూర్తయింది.తిరుపతి జిల్లాలో కూడా చివరి దశలో ఉంది. మంజూరైన గృహాలు ప్రస్తుతం ఏ దశలో వున్నాయనే వివరాలు నమోదు చేస్తున్నారు.అలాగే వివిధ దశల్లో ఆగిపోయిన గృహ నిర్మాణాలను పూర్తి చేసేందుకు కూడా కూటమి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. త్వరలో కేంద్ర ప్రభుత్వం అమలు చేసే పీఎంఏవై-2.0 గ్రామీణ గృహ నిర్మాణ పథకానికి బదలాయించి పనులు పునఃప్రారంభించేందుకు కసరత్తు జరుగుతోందంటున్నారు. ఏ దశలో ఉన్న నిర్మాణాలను ఈ కేంద్ర పథకానికి వర్తింపజేస్తారనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. ఒక్కో యూనిట్ కాస్ట్‌ను రూ.4 లక్షలు అని ఆ మధ్య సీఎం చంద్రబాబు ప్రకటించినా.. కేంద్ర ప్రభుత్వం తన వాటాను పెంచకపోవడంతో తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2014 నుంచి కూడా కేంద్ర ప్రభుత్వం తన వాటాను రూ.1.50 లక్షలుగా ఇస్తోంది. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం అదనంగా రూ.లక్ష వాటా వేసి లబ్ధిదారులకు రూ.2.50 లక్షలిచ్చేది. 2019-24 మధ్య వైసీపీ ప్రభుత్వం నయాపైసా కూడా రాష్ట్రం తరపున వాటా కేటాయించలేదు. దీంతో చాలామంది లబ్ధిదారులు నిర్మాణాలకు ముందుకు రాలేదు. జిల్లాకు 72,272 గృహాలు మంజూరైతే సగం కూడా నిర్మాణాలు పూర్తికాలేదు. ఇప్పుడు కూడా కేంద్రం తన వాటా పెంచకపోవడంతో.. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆలోచనలో పడినట్లు తెలుస్తోంది. రూ.2.50 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు యూనిట్ కాస్ట్ ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు.



శాంతిపురం మండలం రాళ్లబూదుగూరులో సర్వే చేస్తున్న సిబ్బంది

ఎన్టీఆర్ గ్రామీణ గృహ లబ్ధిదారుల వివరాలు

జిల్లా	గృహాలు	పెండింగ్ బిల్లులు రూ.కోట్లలో
చిత్తూరు	29,093	రూ.47.19
తిరుపతి	23,484	రూ.39.06

మద్యం షాపుకో పర్మిట్ రూమ్!



చిత్తూరు ఎమ్మెస్సార్ సర్కిల్లోని వైన్‌షాప్‌కు కుడి పక్కన పరదాలు కట్టి ఉన్నదే పర్మిట్ రూమ్

- నష్టపోతున్నామంటున్న బార్ల యజమానులు

చిత్తూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన లిక్కర్ పాలసీలో పర్మిట్ రూమ్‌కు అవకాశం లేదు.అయితేనేం... జిల్లా కేంద్రమైన చిత్తూరులోనే దాదాపు అన్ని మద్యం దుకాణాల పక్కన పర్మిట్ రూముల్ని ఏర్పాటు చేసేశారు. వాస్తవానికి 2019-24 మధ్య అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం మద్యం దుకాణాల పక్కన పర్మిట్ రూముల్ని ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి ఇచ్చింది. ఏడాదికి ప్రతి పర్మిట్ రూమ్‌కు రూ.5 లక్షలు వసూలు చేసింది. ఇలా ప్రభుత్వానికి ఆదాయం సమకూరింది. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం నేరుగా మద్యం దుకాణాల్ని నిర్వహించడంతో పర్మిట్ రూముల విధానం లేకుండా పోయింది. తాజాగా కూటమి ప్రభుత్వం పర్మిట్ రూములను అనుమతించలేదు.అయితే చిత్తూరులో మద్యం దుకాణాల్ని దక్కించుకున్నవారు అనధికార పర్మిట్ రూముల్ని ఏర్పాటు చేసుకున్నారు. మరికొన్ని చోట అధికార పార్టీ సానుభూతిపరులు ఈ రూముల్ని నిర్వహిస్తున్నారు. మద్యం దుకాణంలో బాటిళ్ల కొనుగోలు చేస్తున్నవారు పక్కనే ఉన్న రూముల్లో కూర్చొని తాగేస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి పన్నులు కట్టి నిర్వహిస్తున్న తమ బార్లకు నష్టం వాటిల్లుతోందని బార్ల యజమానులంటున్నారు. పర్మిట్ రూముల్ని ఎక్సైజ్ శాఖ అధికారులు తొలగించాలని డిమాండు చేస్తున్నారు.



పాత బస్టాండులోని వైన్‌షాపు కుడి పక్కనున్న రెండు పర్మిట్ రూములు

కొత్త బస్టాండులోని షాపునకు ఎడమ వైపు షెడ్డులో తాగేందుకు సౌకర్యం



గుంత తెచ్చిన తంటా

- బస్సు ప్రయాణికులకు త్రుటిలో తప్పిన ప్రమాదం

గంగాధరనెల్లూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రయాణికులకు త్రుటిలో ప్రమాదం తప్పింది. పోలీసులు, ప్రయాణికులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు నుంచి పుత్తూరుకు ఓ ఆర్టీసీ బస్సు బయల్దేరింది. చిత్తూరు - పుత్తూరు రహదారిలో బొబ్బిగానిపల్లెకు సమీపంలో ఎదురుగా ఓ కంటైనర్ లారీ వస్తోంది. బస్టాప్ సమీపానికి వచ్చేసరికి నడి రోడ్డుపై ఏర్పడ్డ గుంతను లారీ డ్రైవర్ తప్పించబోయి పక్కకు మళ్లించాడు. ఎదురుగా బస్సును ఢీకొట్టే పరిస్థితికి చేరుకోవడంతో ఆర్టీసీ డ్రైవర్ అప్రమత్తమై.. చాకచక్యంగా రోడ్డుపక్కన ముళ్లపొదల్లోకి దింపేశాడు. దీంతో పెనుప్రమాదం తప్పింది. బస్సు డ్రైవర్ ఏమరుపాటుగా ఉన్నా.. హైటెన్షన్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టే పరిస్థితి ఏర్పడేది. ఏదేమైనా అటు లారీని, ఇటు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టకుండా బస్సును ఆపడంతో ప్రయాణికులు తొలుత భయపడ్డా.. తర్వాత ఊపిరిపీల్చుకున్నారు.గంగాధరనెల్లూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఎక్స్‌కవేటర్ సాయంతో బస్సును ముళ్ల పొదల్లోంచి రోడ్డుపైకి తీసుకొచ్చారు.



బొబ్బిగానిపల్లె వద్ద నడిరోడ్డుపై ఉన్న గుంత



రోడ్డుపక్కన ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లిన బస్సు



డీఆర్వోగా మోహన్‌కుమార్

- జీఏడీకి రిపోర్టు చేసుకోవాలని పుల్లయ్యకు ఆదేశాలు
- పలమనేరు ఆర్డీవోగా భవాని

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) పుల్లయ్య బదిలీ అయ్యారు. ఆయన్ను జీఏడీకి రిపోర్టు చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆయన స్థానంలో విశాఖపట్నం డీఆర్వో కె.మోహన్‌కుమార్‌ను నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. జిల్లా ఫారెస్టు సెటిల్‌మెంట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న భవానీని పలమనేరు ఆర్డీవోగా నియమించింది. బుధవారం పలమనేరు ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన వెంకటేష్‌ను 24 గంటల్లోపే బదిలీ చేసింది. వెంకటేష్‌ను జేఏడీకి రిపోర్టు చేసుకోవాల్సిందిగా ఉత్తర్వులు జారీచేసింది.

డీఈవోగా వరలక్ష్మి

- పాత డీఈవోకు దక్కని పోస్టింగు
- దేవరాజును వెయిటింగులో వుంచిన ప్రభుత్వం

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వివాదాస్పద అధికారిగా పేరు తెచ్చుకున్న డీఈవో దేవరాజు ఎట్టకేలకు బదిలీ అయ్యారు.ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా వెయిటింగులో ఉంచిన ప్రభుత్వం తదుపరి ఉత్తర్వుల కోసం వేచి ఉండాలని బదిలీ ఉత్తర్వుల్లో పేర్కొంది.అనంతపురం డీఈవో వరలక్ష్మి చిత్తూరుకు బదిలీపై వస్తున్నారు. ఆమె శనివారం బాధ్యతలు చేపట్టే అవకాశాలున్నాయి.వైసీపీ సానుభూతిపరుడని ఆరోపణలు ఎదుర్కొన్న డీఈవో దేవరాజు తీరు మీద గతంలో జరిగిన జడ్పీ, దిశ సమావేశాల్లో చిత్తూరు, పూతలపట్టు, జీడీనెల్లూరు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, మురళీమోహన్, థామస్ ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. కలెక్టరుకు కూడా ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే మురళీమోహన్ సిఫార్సు తెచ్చిన ఓ మహిళా ఉద్యోగితో పాటు తోడు వచ్చిన హెచ్ఎంకూ షోకాజ్ నోటీసులు ఇవ్వడం చర్చనీయాంశమైంది. ఎమ్మెల్యే మురళీమోహన్ ఈ విషయమై విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు కూడా ఫిర్యాదు చేశారు.



వరలక్ష్మి

గంటా మోహన్‌పై సస్పెన్షన్ ఎత్తివేత

ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకుడు, బంగారుపాళ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గంటా మోహన్‌పై సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ డీఈవో దేవరాజు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలపై డీఈవో కార్యాలయం ఎదుట టీచర్లతో కలిసి ధర్నా చేసినందుకు గంటా మోహన్‌ను ఈ నెల 9న డీఈవో సస్పెండ్ చేశారు. దీనిపై ఉపాధ్యాయ సంఘాలు ఫ్యాప్టో ఆధ్వర్యంలో చిత్తూరులో సమావేశమై సస్పెన్షన్‌ను తీవ్రంగా ఖండించాయి. వారికి ఎన్జీవో, ప్రజాసంఘాలు మద్దతు పలికాయి. అనంతరం ఫ్యాప్టో నాయకులు డీఈవోను కలిసి గంటా మోహన్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. ఉపాధ్యాయ సంఘాలు, ప్రజాప్రతినిధుల ఒత్తిడి మేరకు.. అన్ని విషయాలనూ పరిగణనలోకి తీసుకుని గురువారం గంటా మోహన్‌పై సస్పెన్షన్‌ను ఎత్తివేశారు. దీంతో ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.

మద్యం మత్తులో ఎస్ఐతో దురుసు ప్రవర్తన

- వీఆర్‌కు హెడ్ కానిస్టేబుల్

భాకరాపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి):చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్‌ను వీఆర్‌కు పంపుతూ ఎస్పీ సుబ్బరాయుడు ఉత్తర్వులు జారీ చేశారు.భాకరాపేట సీఐ ఇమ్రాన్‌బాషా కథనం మేరకు...బుధవారం రాత్రి చంద్రశేఖర్ గస్తీ నిర్వహిస్తుండగా ఎర్రావారిపాలెం ఎస్ఐ ఎర్రిస్వామి భాకరాపేట బీట్ తనిఖీ చేశారు. ఆ సమయంలో మద్యం మత్తులో వున్న చంద్రశేఖర్ ఎస్ఐ పట్ల దురుసుగా ప్రవర్తించారు. దీంతో హెడ్‌కానిస్టేబుల్‌పై ఉన్నతాధికారులకు ఎస్ఐ ఫిర్యాదు చేశారు. అధికారులు విచారించి చంద్రశేఖర్‌ను వీఆర్‌కు పంపుతూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

స్టార్ ఎయిర్ లైన్స్ విమానానికి బాంబు బెదిరింపు

రేణిగుంట, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి):తిరుపతి మీదుగా నడిచే స్టార్ ఎయిర్ లైన్స్ విమానాన్ని బాంబుతో పేల్చివేస్తామంటూ ట్విట్టర్ ద్వారా అగంతకుడొకరు బెదిరించారు. తిరుపతి విమానాశ్రయ అధికారుల కథనం మేరకు... బెంగళూరు నుంచి తిరుపతికి, ఇక్కడి నుంచి బెల్గాంకు సర్వీసులు నడుపుతున్న స్టార్ ఎయిర్ లైన్స్ కంపెనీ విమానాన్ని బాంబులతో పేల్చివేస్తామంటూ ఓ అగంతకుడు మెసేజ్ పెట్టడంతో గుర్తించిన విమానాశ్రయ అధికారులు, భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. తిరుపతి విమానాశ్రయంలోని కేంద్ర బలగాలు గురువారం మధ్యాహ్నం నుంచి వివిధ ప్రాంతాల నుంచీ వచ్చిన విమానాలను తనిఖీ చేశారు. అదేవిధంగా కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ నుంచి సాయంత్రం ఏడు గంటలకు తిరుపతికి చేరుకొని తిరిగి ఏడున్నరకు శివమొగ్గకు బయల్దేరే విమానాన్ని ప్రత్యేకంగా తనిఖీ చేశారు. అయితే ఎటువంటి పేలుడు వస్తువులు విమానంలో కన్పించకపోవడంతో అది ఒక ఫేక్ కాల్‌గా గుర్తించి విమానాన్ని పంపివేశారు.

పులికూన సంచారంపై వదంతులు



పులికూన జాడ కోసం పొలాల్లో రైతులతో కలిసి వెతుకుతున్న అటవీశాఖాధికారులు

- పుంగనూరు వద్ద పొలాల్లో గాలింపు చర్యలు

పుంగనూరు, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): పుంగనూరు బైపాస్ రోడ్డు మేలుపట్ల సమీపంలోని వ్యవసాయ పొలాల్లో ఓ పిల్ల చిరుతపులి సంచరిస్తున్నట్లు గురువారం వదంతులు వ్యాపించాయి. ఈ విషయాన్ని మేలుపట్లకు చెందిన దొరబాబు అటవీ శాఖ అధికారులకు చెప్పడంతో వారు బైపాస్‌రోడ్డు చేరుకున్నారు. రైతులతో కలిసి పొలాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. పొలాల నుంచి చదళ్ల చెరువులోకి వెళ్లిందని దొరబాబు చెప్పడంతో చదళ్ల గ్రామానికి వెళ్లి రైతులకు, పశువులకాపరులకు ముందు జాగ్రత్తగా చెరువులోకి వెళ్లవద్దని సూచించారు. ఎంతవెతికినా ఎక్కడా చిరుత సంచరించినట్లు ఆనవాళ్లు కనిపించకపోవడంతో హైనా కానీ, అడవిపిల్లి కానీ సంచరించివుండవచ్చని అటవీశాఖ సిబ్బంది అంచనా వేశారు.

'బెంగాల్' నాట్లు



సాధారణంగా వరి నాట్లంటే స్థానికంగా ఉన్న మహిళా కూలీలు వేస్తుంటారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వీరు రూ.500 వరకు కూలి తీసుకునేవారు. కానీ, ఏడాదిన్నరగా బెంగాల్ నుంచి మగ కూలీలొస్తున్నారు. కోట, వాకాడు, చిట్టమూరు ప్రాంతాలలో వీరు వరి నాట్లు వేస్తున్నారు. ఎకరా పొలంలో నాట్లు వేసేందుకు 4,300 రూపాయలు తీసుకుంటున్నారు. కాగా, వరినాట్లకు బెంగాల్ మగకూలీలకు డిమాండు పెరిగింది.

- కోట, ఆంధ్రజ్యోతి

గూడలి వద్ద వరినాట్లు వేస్తున్న కూలీలు

'విజ్ఞానగిరి' వద్ద మద్యం దుకాణం వద్దు

శ్రీకాళహస్తి పట్టణ నడిబొడ్డున సుబ్రహ్మణ్యేశ్వర స్వామికొలువైన విజ్ఞానగిరి (కుమారస్వామి తిప్ప) ఆలయం వద్ద మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దంటూ మహిళలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు గురువారం ఎక్సైజ్ సీఐ లావణ్యకు వినతిపత్రం ఇచ్చారు. ఈ ప్రాంతంలో విద్యాసంస్థలు, ఆస్పత్రితో పాటు ఆలయం, ముక్కంటి ఆలయ నారదపుష్కరణి ఉన్నట్లు వివరించారు. వైసీపీ పాలనలోనూ కుమార స్వామి తిప్ప వద్ద మద్యం దుకాణం ఏర్పాటుకు అధికారులు ప్రయత్నించగా తమ నిరసనతో ఆపేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటుకు కొందరు ప్రయత్నిస్తున్నారని.. ఈ ప్రాంత ప్రాశస్త్యం రీత్యా అనుమతి ఇవ్వొద్దని కోరారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



ఎక్సైజ్ సీఐ లావణ్యకు వినతిపత్రం ఇస్తున్న మహిళలు

గ్రంథాలయ విద్యలో 50 ఏళ్లు

- నేటి నుంచి ఎస్వీయూలో లైబ్రరీ సైన్స్ విభాగ స్వర్ణోత్సవాలు



లైబ్రరీ సైన్స్ విభాగం

విజ్ఞాన కేంద్రాలుగా గ్రంథాలయాలు సమాజంలో నిలిచాయి. ఎస్వీయూలో లైబ్రరీ సైన్స్ డిపార్ట్‌మెంట్ 1974లో ప్రారంభమైంది. తొలుత బీఎల్ఐఎస్‌సీ కోర్సు నిర్వహించింది. ప్రస్తుతం ఎంఎల్ఐఎస్‌సీ, పీహెచ్‌డీ కోర్సులు నిర్వహిస్తూ ఉంది. తొలి రోజుల్లో ఎస్.శ్రీపతి నాయుడు, ఎన్.గురుస్వామి నాయుడు, టి.రాజగోపాల్ తదితరులు ఆచార్యులుగా ఈ విభాగంలో సేవలు అందించారు. ప్రస్తుతం ఒక రెగ్యులర్ ఫ్యాకల్టీతో పాటు మిగతా అకడమిక్ కన్సల్టెంట్లు బోధన సాగిస్తూ ఉన్నారు. లైబ్రరీ సైన్స్ డిపార్ట్‌మెంట్‌లో ఇప్పటి వరకు 89 పీహెచ్‌డీలు, 32 ఎంఫిల్ డిగ్రీలు పూర్తయ్యాయి. చిన్నారుల్లో పుస్తక అధ్యయనం పట్ల ఆసక్తిని పెంచడంపై ఒక పరిశోధనా ప్రాజెక్టు నిర్వహించారు. పీజీలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఏటా నాలుగు బంగారు పతకాలు ప్రదానం చేస్తున్నారు. పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సులను నిర్వహించారు. గ్రంథాలయ నిర్వహణ పట్ల విద్యార్థులకు ప్రయోగాత్మకంగా అవగాహన కలిగిస్తున్నారు. ఇలా బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో సేవలు అందించింది. గ్రంథాలయ విద్యలో ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దింది. పూర్వ విద్యార్థులు ప్రస్తుతం అనేక చోట్ల ఉన్నత స్థానాల్లో రాణిస్తున్నారు. ఈ నేపథ్యంలో వర్సిటీ లైబ్రరీ సైన్స్ విభాగం స్వర్ణోత్సవాలు నిర్వహించుకోనుంది.



శ్రీపతి నాయుడు



గురుస్వామి నాయుడు

- తిరుపతి(విశ్వవిద్యాలయాలు), (ఆంధ్రజ్యోతి)

ఘనమైన స్ఫూర్తిని కొనసాగిస్తాం



యాభై ఏళ్ల సుదీర్ఘ చరిత్రను ఒకసారి సమీక్షించుకుంటాం. గడిచిన చరిత్రను గుర్తు చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో చేయవలసిన అభివృద్ధికి అవసరమైన స్ఫూర్తిని పొందుతాం. ఇలా లైబ్రరీ సైన్స్ విభాగాన్ని మరింతగా అభివృద్ధి చేయడానికి ప్రయత్నిస్తాం.

- ప్రొఫెసర్ ప్రశాంతికుమారి, హెడ్, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్

నేడు స్వర్ణోత్సవ సంబరం : లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ స్వర్ణోత్సవ సంబరం శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు జరగనుంది. ఉదయం 10 గంటలకు సెనేట్ హాల్లో ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఇందులో ఇన్‌చార్జి వీసీ అప్పారావు, ద్రవిడ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ దొరస్వామి, వర్సిటీ రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ప్రిన్సిపాల్ సుధారాణి, సెంట్రల్ లైబ్రరీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.సురేంద్రబాబు, లైబ్రరీ సైన్స్ హెడ్ ప్రశాంత కుమారి పాల్గొంటారు. గోల్డెన్ జూబ్లీ సావనీర్‌ను ఆవిష్కరిస్తారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

వైసీపీ గురివింద రాజకీయం



- ఎస్వీయూ స్టేడియంలో కార్తీక్ షోపై విమర్శలు
- అద్దెకు ఇవ్వడం ఏమిటంటూ రాద్ధాంతం
- మరి జగన్ పాలనలో చేసిందేమిటి?

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ తారకరామ స్టేడియాన్ని ప్రముఖ నేపథ్య గాయకుడు కార్తీక్ లైవ్ షోకు ఇవ్వడంపై వైసీపీ గురివింద రాజకీయం చేస్తోంది. స్టేడియాన్ని ప్రైవేట్ షోలకు ఇస్తూ విశ్వవిద్యాలయాన్ని అధికార పార్టీ భ్రష్టు పట్టిస్తోందని జగన్ పత్రికలో కథనాలు వేశారు. ఎస్వీయూ స్టేడియంలో ప్రైవేట్ కార్యక్రమాల నిర్వహణ కొత్తేమీ కాదన్న విషయం తెలిసీ అధికారులపై విమర్శలు గుప్పించారు. దీనివెనుక టీడీపీ ఉందంటూ ఆరోపించడంపై పలువిద్యార్థి సంఘాలు, వర్సిటీ వర్గాలు మండిపడుతున్నాయి. నిబంధనల మేరకు ఓ సంగీత కార్యక్రమానికి స్టేడియాన్ని అద్దెకు ఇస్తే అసత్యప్రచారం చేయడం తగదని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వంలో వర్సిటీ ప్రాంగణంలోనే అనేక రాజకీయ కార్యక్రమాలను నిర్వహించారని గుర్తుచేశారు.

ఎప్పటినుంచో అద్దెకు ఎస్వీయూ స్టేడియం

1954 నుంచీ యూనివర్సిటీకి స్టేడియం ఉంది. 1966లో ఆధునికీకరించారు. సుమారు పది ఎకరాల విస్తీర్ణంతో 10 వేల మందికి పైగా సామర్థ్యంతో స్టేడియం ఉంది. వర్సిటీ అవసరాలకు ఉపయోగించుకుంటూనే, బయటి వ్యక్తులకు క్రీడా, సినిమా, సాంస్కృతిక, సంగీత ప్రదర్శనలకు కేటాయిస్తూ వస్తున్నారు. దీనికి అద్దె వసూలు చేస్తున్నారు. బయటి వ్యక్తులకు క్రీడా పోటీలకు రోజుకు రూ. 5 వేల చొప్పున ధరలు నిర్ణయించారు. గతంలో ఇది రూ.4 వేలు ఉండగా, ఇటీవల నిర్వహించిన స్పోర్ట్స్ బోర్డ్ మీటింగ్‌లో రూ. 5 వేలు చేశారు. నాన్ కమర్షియల్ కోసమైతే రోజుకు రూ. లక్ష, మరో రూ.25 వేలు నిర్వహణ కోసం కట్టించుకుంటారు. కమర్షియల్ అయితే రూ.3 లక్షల రుసుంతో పాటు నిర్వహణ కింద మరో రూ.50 వేలు ధర నిర్ణయించారు. ప్రస్తుతం లైవ్ షోకు రూ.3.5 లక్షలు నిర్వాహకులు చెల్లించారు. గతంలో బాహుబలి, ఆదిపురుష్ వంటి సినిమా ఫంక్షన్లనూ ఎస్వీయూ తారకరామ స్టేడియంలోనే నిర్వహించారు. దీనికి అనుమతులు, అద్దెనూ ఇదే తరహాలో చేశారు. అయితే, కార్తీక్ లైవ్ మ్యూజిక్ షో పట్ల కొందరు రాద్ధాంతం చేయడం పట్ల అభ్యంతరం వ్యక్తమవుతోంది. యూనివర్సిటీల్లో అనేక ప్రభుత్వ, ప్రభుత్వేతర, క్రీడా, సినిమా, సాంస్కృతిక, మ్యూజిక్, బుక్ రిలీజ్ వంటి కార్యక్రమాలు నిరంతరంగా సాగుతున్నాయి.

ఎప్పటి నుంచో అద్దెకు ఇస్తున్నాం

తారకరామా స్టేడియాన్ని ఎప్పటి నుంచో అద్దెకు కేటాయిస్తున్నాం. ఇదంతా యూనివర్సిటీ నియమ నిబంధనల ప్రకారమే చేస్తున్నాం. ప్రస్తుతం కార్తీక్ లైవ్ మ్యూజిక్ షో నిర్వాహకులు అనుమతి కోరారు. ముందుగానే అద్దె చెల్లించారు. అందుకే అనుమతించాం.

- ప్రొఫెసర్ శివశంకర్‌రెడ్డి, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగ డైరెక్టర్, ఎస్వీయూ

కార్తీక్‌షో వల్ల ఇబ్బందేమి?

నిబంధనల ప్రకారం రోజుకు రూ.3.5 లక్షలను నిర్వాహకులు ఇప్పటికే చెల్లించారు. స్టేడియాన్ని అధికారికంగానే కేటాయించినా ఇలాంటి విమర్శలు చేయడం దారుణమని యూనివర్సిటీ వర్గాలు పేర్కొంటున్నాయి. బయటి వ్యక్తులకు అద్దెకు స్టేడియంను కేటాయించిన నేపథ్యంలో నిర్వాహకులు వారి ఇష్ట ప్రకారం నిర్వహణను చేపట్టనున్నారు. ఈ వ్యవహారంతో యూనివర్సిటీ ఉన్నతాధికారులకు ఎలాంటి సంబంధం ఉండదు. అధికారులతో పాటు ఎలాంటి సంబంధం లేని వ్యక్తులనూ ఈ వ్యవహారంలోకి లాగుతుండటం గమనార్హం. ఇక, ఈ కార్యక్రమం ఎలాంటి అసభ్యకరమైన డ్యాన్స్‌లతో కూడినది కాదు. వారాంతంలో.. ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 నుంచి 10 గంటల వరకూ మ్యూజిక్ షో ఉంటుంది. దీనివల్ల పని వేళల్లో విద్యార్థులు, ఉద్యోగులకు కూడా ఇబ్బంది తలెత్తే అవకాశం లేదు. అయినా కొందరు వివాదాస్పదం చేయడం గమనార్హం. యూనివర్సిటీ అధికారులను ఇబ్బందులకు గురి చేయాలనే ఆలోచనతో ప్రభుత్వానికి కూడా ఫిర్యాదు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సమావేశంలో మాట్లాడుతున్న వసుధమిత్రా



పారిశ్రామిక భద్రతే ధ్యేయం

- రాష్ట్ర పరిశ్రమల ఉన్నత స్థాయి కమిషన్ చైర్‌పర్సన్ వసుధామిశ్రా

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పారిశ్రామిక భద్రతను మెరుగుపరచడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని, పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని రాష్ట్ర పరిశ్రమల ఉన్నత స్థాయి కమిషన్ చైర్‌పర్సన్ వసుధామిశ్రా అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం సాయంత్రం నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల కలెక్టర్లతో ఆమె సమావేశమయ్యారు. పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు ప్రభుత్వం ఉన్నతస్థాయి కమిటీని నియమించిందన్నారు. పరిశ్రమల్లో ఎప్పటికప్పుడు అధికారులు తనిఖీలు నిర్వహించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. పర్యావరణం, అటవీ, సైన్స్ టెక్నాలజీ కార్యదర్శి అనంతరాము మాట్లాడుతూ పరిశ్రమల్లో మౌలిక సదుపాయాలు, మానవ వనరుల పరంగా సంస్థలను బలోపేతం చేయాలని సూచించారు. ప్రభుత్వ కార్యదర్శి ఎంఎంనాయక్ పరిశ్రమల భద్రతపై పలు సూచనలు చేశారు. అంతకు ముందు జిల్లాలోని పలు పరిశ్రమలను సందర్శించి, ప్రతినిధులతో చర్చించారు.సమావేశంలో తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాల కలెక్టర్లు వెంకటేశ్వర్, సుమిత్ కుమార్, ఆనంద్, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యదర్శి శరవణన్, ఇతర అధికారులు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులు పూర్తిచేస్తాం : సీఈ



మల్లికార్జున్‌రెడ్డి

తిరుపతి (జీవకోన), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కుప్పం బ్రాంచ్ కెనాల్, హంద్రీనీవా బ్రాంచ్ కెనాల్, తిరుపతికి తాగునీరు అందించేందుకు బాలాజీ రిజర్వాయర్, మల్లిమడుగు రిజర్వాయర్ పనులను త్వరలోనే పూర్తి చేస్తామని ఎన్టీఆర్ తెలుగుగంగ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ ఎం.మల్లికార్జునరెడ్డి తెలిపారు. గురువారం ఆయన తన చాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులతో పాటు హంద్రీనీవా పనులు పూర్తిచేసి ప్రజలకు నీటిని అందిస్తున్నట్లు తెలిపారు. తిరుపతి యాత్రాస్థలం కావడంతో తాగునీటి సమస్య తలెత్తకుండా బాలాజీ రిజర్వాయర్ పనులు పూర్తి చేస్తామన్నారు.

12 కిలోల గంజాయి స్వాధీనం.. ఇద్దరి అరెస్టు

శ్రీకాళహస్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో 12 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు స్మగ్లర్లను పోలీసులు అరెస్టుచేశారు. శ్రీకాళహస్తి రెండో పట్టణ సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన ప్రకారం.. విశాఖ నుంచి తిరుపతికి గంజాయి రవాణా జరుగుతున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. ఈ మేరకు పట్టణ శివారులోని బైపాస్ వంతెన వద్ద పీఎస్ జాతీయ రహదారిపై రెక్కీ నిర్వహించారు. ఆ సమయంలో చిత్తూరు జిల్లా ఎస్ఆర్‌పురం మండలం ఏఎంపురం అరుంధతివాడకు చెందిన పన్నూరు బాబు(63), ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా ఉదయగిరి గ్రామానికి చెందిన రాజన్‌కుమార్(41) గంజాయితో పోలీసులకు పట్టుబడ్డారు. గంజాయితో పాటు రూ.4వేల నగదు సీజ్ చేసి, వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



రాజన్‌కుమార్



పన్నూరుబాబు

పాకాలలో మరో ఆరు కిలోలు..

పాకాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆరు కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్ట్ చేసినట్లు పాకాల సీఐ మద్దయ్య ఆచారి గురువారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు పాకాల రైల్వే స్టేషన్ వద్ద పోలీసులు గురువారం మాటువేశారు. బ్యాగుతో బయటకు వచ్చిన ఓ బ్యాగు.. పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించాడు. వెంటనే పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. తమిళనాడులోని కడలూరు జిల్లా చొక్కానాథపాళ్యంకు చెందిన శరవణ శంకర్‌గా గుర్తించారు. లీనా అనే వ్యక్తి నుంచి రూ.15,000 తీసుకొని విశాఖ నుంచి చెన్నైకి గంజాయి రవాణా చేస్తున్నట్లు నిందితుడు తెలిపాడు. ఇతడిపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపుతున్నట్లు సీఐ తెలిపారు. ఆరు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడుల్లో ఏఎస్ఐ వెంకటరత్నం నాయుడు, హెడ్‌కానిస్టేబుల్ సోమశేఖర్‌నాయుడు, చలపతి, కానిస్టేబుళ్లు పాల్గొన్నారన్నారు.

డిజిటల్ వ్యాపారంలో మహిళలు రాణించాలి



కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ వ్యాపార రంగంలో మహిళలు రాణించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆకాంక్షించారు. పద్మావతి మహిళా యూనివర్సిటీలో ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకు చేపట్టిన శిక్షణా కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించి ప్రసంగించారు. అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా మహిళలు ఎదగాలని కోరారు. డిజిటల్ వ్యాపార రంగంలో మహిళలు తమ శక్తి సామర్థ్యాలను ఉపయోగించాలన్నారు. ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని సూచించారు. పద్మావతి వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ ఉమ మాట్లాడుతూ మహిళలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడం ద్వారా మహిళా సాధికారతకు మహిళా యూనివర్సిటీ దోహదం చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షులు ఉమామహేశ్వరిదేవి, ఏపీసీఐసీటీ డైరెక్టర్ కియాంగ్‌కో, కన్సల్టెంట్ ఉషావ్యాసులరెడ్డి, రిజిస్ట్రార్ రజని, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్స్ ప్రొఫెసర్ దుర్గాభవాని, ప్రొఫెసర్ విజయలక్ష్మి, పలు ప్రాంతాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ముగిసిన పారిశ్రామిక భద్రతా కమిటీ తనిఖీలు

శ్రీసిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలో రాష్ట్ర పారిశ్రామిక భద్రతా ప్రమాణాల కమిటీ బృందం నిర్వహిస్తున్న తనిఖీలు గురువారం ముగిశాయి. రాష్ట్రంలోని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను పరిశీలించేందుకు విశ్రాంత ఐఏఎస్ అధికారి వసుధ మిశ్రా నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన పారిశ్రామిక భద్రతా కమిటీ శ్రీసిటీలో మూడు రోజులుగా వివిధ పరిశ్రమల్లో తనిఖీలు చేపట్టింది. ఈ పర్యటనలో కమిటీలోని ఉన్నతాధికారులు, భద్రతా నిపుణులు శ్రీసిటీలోని డైకిన్, కింబర్లీ క్లార్క్, అల్‌స్టోం తదితర పరిశ్రమలలో తనిఖీలు నిర్వహించారు.



డైకిన్ పరిశ్రమను సందర్శించిన కమిటీ బృందం

భారతీయ సంస్కృతికి ఆగమాలు ఆధారం

తిరుపతిరూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతికి ఆగమాలు ఆధారాలని తిరుమల విఖనసట్రస్ట్ కార్యదర్శి గంజాం ప్రభాకరాచార్యులు తెలిపారు. తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో అర్చనం(వైఖానసం) అనే అంశంపై తొమ్మిది రోజుల జాతీయ సదస్సు గురువారంతో ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఆగమశాస్త్రం భగవన్నిర్మితమని, ఆధ్యాత్మిక మార్గంలో మన జీవనయాత్ర సఫలం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. రిటైర్డ్ ప్రొఫెసర్ తట్టా విజయరాఘవాచార్యులు మాట్లాడుతూ ఆలయాలలో అర్చకుని పాత్ర కీలకమైందని, అర్థపంచకం శరణాగతి తత్వాలు అలవర్చుకుని అర్చన చేస్తే విశేష ఫలితాలు ఉంటాయని చెప్పారు. వేదాంతం డీన్, సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ వేదాంతం విష్ణుభట్టాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

తిరుచానూరు ఆలయంలో భారీగా బదిలీలు

తిరుచానూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో ఏళ్ల తరబడి తిష్ట వేసుకున్న కొంతమంది అధికారులు, సిబ్బందిని బదిలీ చేస్తూ గురువారం టీటీడీ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆలయ ఏఈవో రమేష్‌ను హైదరాబాద్‌లోని టీటీడీ సమాచార కేంద్రానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో తిరుమల ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న దేవరాజులను నియమించారు. సూపరింటెండెంట్ శేషగిరిని హెచ్‌ఆర్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఆయన స్థానంలోఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల సూపరింటెండెంట్ ప్రసన్నకుమార్‌ను నియమించారు. ఆర్జితం ఇన్‌స్పెక్టర్ గణేష్‌ను డిప్యూటీ ఈవో కార్యాలయానికి, అక్కడ పనిచేస్తున్న మురళిని బదిలీ చేశారు. ప్రసాదాల ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌ను ఉగ్రాణానికి, అక్కడ పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్ జయకుమార్‌ను హెచ్‌ఆర్‌లో రిపోర్టు చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్జితం ఇన్‌స్పెక్టర్‌గా సుబ్బరాయులు, ప్రసాదాల ఇన్‌స్పెక్టర్‌గా చలపతిని నియమించారు.

రేపటి నుంచి ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్జీఎఫ్ అండర్ 19 రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు శనివారం నుంచి నిర్వహించనున్నట్లు స్కూల్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎస్.జయరామయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల బాలబాలికలు 10వ తరగతి మార్కులిస్టు, స్టడీ, ఆధార్ జిరాక్సులు వెంట తీసుకురావాలని పేర్కొన్నారు. క్రీడా పోటీల తేదీలు, ఇతర వివరాలకు 26న బాలాజీ కాలనీలోని విశ్వేశ్వర యోగా రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో యోగాసనం పోటీలు(9393621004), 27న మధ్యాహ్నం 3.30గంటల నుంచి శ్రీనివాస క్రీడా సముదాయంలో మహిళా క్రికెట్(9393621004), 27న ఉదయం 9.30నుంచి రేణిగుంట జిల్లా పరిషత్ పాఠశాలలో సాఫ్ట్ టెన్నిస్, స్క్వాష్(8712257060), 30న ఉదయం 9.15 గంటల నుంచి చిత్తూరులోని డీఎస్‌ఏ స్టేడియంలో ఖోఖో, రోప్ స్కిప్పింగ్, ఫెన్సింగ్(9440674457) సంప్రదించాలని సూచించారు.

నేడు కలెక్టరేట్‌లో పెన్షన్ అదాలత్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు సంబంధించి జీపీఎఫ్ పెన్షన్ సమస్యల పరిష్కారం కోసం పెన్షన్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఖజానా, లెక్కల అధికారి లక్ష్మీకరరెడ్డి తెలిపారు. పెన్షనర్లకు, జీపీఎఫ్‌కు సంబంధించిన సమస్యలు తెలిపితే అక్కడే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జలవనరులకు మహర్దశ

జిల్లాలో 220 సాగునీటి సంఘాలకు వచ్చేనెల ఎన్నికలు


కృష్ణాపురం జలాశయం

చిత్తూరు సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సాగునీటి ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు సాగునీటి కాలువలను బాగుచేసేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గత టీడీపీ పాలనలో జలవనరుల సంరక్షణకు సాగునీటి సంఘాలుండేవి. వీటిని వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సాగునీటి సంఘాలు తిరిగి క్రియాశీలకంగా మారనున్నాయి. వచ్చేనెల 21 నుంచి 23వ తేదీలోగా ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం ప్రకటన జారీ చేసింది. సార్వత్రిక ఎన్నికల తర్వాత తొలిసారి పల్లెల్లో ఎన్నికల సందడి నెలకొననుంది.

40 రోజుల్లోనే ముగించేలా ప్రక్రియ

జిల్లాలో 220 సాగునీటి వినియోదారుల సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఓట్ల జాబితా తయారీ నుంచి పోలింగ్ ప్రక్రియను 40 రోజుల్లో ముగించేలా జలవనరులు, రెవెన్యూ శాఖల అధికారులు దృష్టి సారించారు. రైతు ప్రతినిధులు సభ్యులుగా ఉండే ఈ సంఘాలు 2003లో ఆవిర్భవించాయి. 2015లో ఎన్నికలు జరగ్గా సంఘాల కాలపరిమితి 2020తో ముగిసింది. ఆపై అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ వ్యవస్థను నిర్వీర్యం చేసింది. దీనివల్ల చెరువులు, మీడియం ప్రాజెక్టుల నిర్వహణ అటకెక్కింది. దీనివల్ల వీటికి ప్రస్తుతం నీరు చేరే పరిస్థితి లేదు. ఈ కారణంగా వర్షాలు సమృద్ధిగా కురిసినా పంటల సాగుకు నీరు అందడంలేదు. దాంతో సాగునీటి సంఘాలను పునరుద్ధరిస్తామని కూటమి నాయకులు ఎన్నికల సమయంలో హామీ ఇవ్వడంతో అధికారంలోకి రావడంతో అమలు దిశగా చర్యలు ప్రారంభించారు.

31న ఓటర్ల జాబితా ప్రదర్శన

ఎన్నికల నిర్వహణకు కలెక్టర్ అధీకృత అధికారులను నియమిస్తారు. రెవెన్యూ, జలవనరుల శాఖ అధికారులు కలిసి సాగునీటి సంఘాల పరిధిలోని ఓటర్ల వివరాలను నమోదు, అభ్యంతరాల స్వీకరణ, 31న ఓటర్ల జాబితా ప్రదర్శిస్తారు. నవంబరు మూడో తేదీన కలెక్టర్ ఆధ్వర్యంలో తుది జాబితా ప్రకటన, దీనిపై మళ్లీ అభ్యంతరాల స్వీకరణ ఆపై 18 నుంచి 20వ తేదీలోగా తుది ఓటర్ల జాబితా ప్రకటన ఉంటుంది. 21 నుంచి 23వ తేదీలోగా ఎన్నికల నిర్వహిస్తారు. ఎన్నికలు జరిగిన రోజునే ఫలితాలు వెల్లడిస్తారు.

బెంగళూరులో అపార్ట్‌మెంట్ కూలిన ఘటన
మృతుల్లో కృష్ణంపల్లె యువకుడు


తులసీరామ్‌రెడ్డి (ఫైల్ ఫొటో)


మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న హరికృష్ణ

గంగాధరనెల్లూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో అపార్ట్‌మెంట్ కూలిన ఘటనలో గంగాధరనెల్లూరు మండలవాసి తులసీరామ్‌రెడ్డి మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. గంగాధరనెల్లూరు మండలం వింజం పంచాయతీ కృష్ణంపల్లెకు చెందిన పట్టాభిరెడ్డి కుమారుడు తులసీరామ్‌రెడ్డి (26)కి మూడేళ్ల కిందట సావిత్రితో వివాహమైంది. వీరికో కుమారుడు చేతన్‌సాయి ఉన్నాడు. బెంగళూరులోని భద్రప్పలేఅవుట్‌లో నివాసం ఉంటూ ప్లంబర్‌గా జీవనం సాగిస్తున్నాడు. బెంగళూరు బాబుసాబ్‌పాళ్యలో కొత్తగా నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్‌లో పనిచేస్తుండగా ఈనెల 22వతేదీ సాయంత్రం ఆరు అంతస్తుల అపార్ట్‌మెంట్ కూలిపోయింది. ఈ భవనం శిథిలాల కింద చిక్కుకుని మరణించిన వారిలో బుధవారం నాటికి ఎనిమిది మందిని గుర్తించారు. వీరిలో తులసీరామ్‌రెడ్డి కూడా ఉన్నాడు. ఆయన మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించాక కృష్ణంపల్లెకు తరలించడంతో గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. విషయం తెలుసుకున్న గుమ్మడి కుతూహలమ్మ కుమారుడు హరికృష్ణతోపాటు పలువురు టీడీపీ, వైసీపీ నేతలు వేర్వేరుగా కృష్ణంపల్లెకు వచ్చి తులసీరామ్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి, పూలమాలలు వేసి, కుటుంబీకులను పరామర్శించారు.

ఎంపీటీసీకి కన్నీటి వీడ్కోలు


జగన్నాథరాజుకు నివాళులర్పిస్తున్న చిట్టిబాబునాయుడు

పాలసముద్రం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఫైనాన్స్ వ్యాపారుల ఆగడాలకు బలైపోయిన పాలసముద్రం మండలం నరసింహాపురం ఎంపీటీసీ జగన్నాథరాజు(50)కు గురువారం స్వగ్రామమైన టీవీఎన్‌ఆర్.పురంలో అంత్యక్రియలను గురువారం నిర్వహించారు.పొక్లయినర్ కంతులు కట్టకపోవడంతో ఏలూరు జిల్లా నూజివీడులోని ఫైనాన్స్ కంపెనీకి చెందిన కొంతమంది సోమవారం జీడీనెల్లూరులో జగన్నాథరాజును కిడ్నాప్ చేసి నూజివీడుకు తరలించిన విషయం తెలిసిందే. మంగళవారం తెల్లవారుజామున ముసునూరు మండలం కాట్రేనిపాడు గ్రామ శివారులో బహిర్భూమికంటూ దిగిన జగన్నాథరాజు తప్పించుకోబోతూ అక్కడి పామాయిల్ తోటలో శవమై పడివున్నాడంటూ జగన్నాథరాజు భార్యకు కిడ్నాపర్లు సమాచారం అందించారు.నూజివీడులో బుధవారం జగన్నాథరాజుకు పోస్టుమార్టం పూర్తయ్యాక శవాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చిన కుటుంబసభ్యులు గురువారం అంత్యక్రియలు జరిపించారు.టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేనిచిట్టిబాబునాయుడు, జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, జిల్లా టీడీపీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్ గౌరవ సూచికంగా జగన్నాథరాజు భౌతికకాయంపై టీడీపీ జెండాను కప్పి నివాళులర్పించారు. పార్టీ తరపున మృతుడి భార్య రాధకు రూ.5,000 అందజేసి పార్టీ అండగా ఉండి కుంటుబాన్ని ఆదుకుంటుందని అనునయించారు. టీడీపీ నాయకులు హరిబాబు, రమేష్, వెంకటేష్‌యాదవ్, శేఖర్‌రాజు, సాంబశివన్, అరుళ్‌నాథన్, గంగాధరనెల్లూరు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పొన్నా యుగంధర్ కూడా జగన్నాథరాజుకు నివాళులర్పించారు.జగన్నాథరాజు అంతిమ యాత్రలో భారీ ఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

625 కిలోల రేషన్‌బియ్యం పట్టివేత

ముగ్గురి అరెస్ట్

ఆటో, ద్విచక్రవాహనం స్వాధీనం

గంగాధరనెల్లూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రేషన్‌బియ్యం అక్రమంగా తరలిస్తుండగా గంగాధరనెల్లూరు పోలీసులు పట్టుకున్నారు. ఇన్‌చార్జి ఎస్‌ఐ వెంకటసుబ్బమ్మ తెలిపిన మేరకు.. గంగాధరనెల్లూరుకు సమీపంలోని ముక్కళత్తూరు క్రాస్ వద్ద గురువారం పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తున్నారు. చిత్తూరు సంతపేటకు చెందిన బాలాజి, సుమతి దంపతులు ఆటోలో 545 కిలోల బియ్యాన్ని, మండలంలోని కొత్తవెంటకాపురానికి చెందిన కరుణాకరన్ ద్విచక్రవాహనంలో 80 కిలోల రేషన్ బియ్యాన్ని చిత్తూరుకు తరలిస్తుండగా పట్టుకున్నారు. వీరు గ్రామాల్లో రేషన్‌బియ్యం కొనుగోలు చేసి చిత్తూరులో అధిక ధరలకు విక్రయాలు సాగిస్తున్నట్లు గుర్తించారు. ముగ్గురినీ అరెస్టుచేసి.. 625 కిలోల బియ్యంతోపాటు ఆటో, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్‌ఐ తెలిపారు.

జనవరి శ్రీవారి దర్శన టికెట్ల కోటా 59 నిమిషాల్లో పూర్తి

తిరుమల, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనానికి సంబంధించిన జనవరి నెల రూ.300 దర్శన టికెట్ల కోటా 59 నిమిషాల్లో పూర్తయింది. జనవరి నెలకు సంబంధించిన రూ.300 ప్రత్యేకప్రవేశ దర్శన టికెట్ల కోటాను టీటీడీ గురువారం ఉదయం 10 గంటలకు విడుదల చేసింది.10.59 గంటలకే కోటా మొత్తంపూర్తయింది. వైకుంఠ ఏకాదశి సందర్భంగా 10 నుంచి 19వ తేదీ వరకు వైకుంఠ ద్వార దర్శనాలు జరుగనున్నాయి. ఈక్రమంలో 10నుంచి 19వతేదీవరకు సంబంధించిన టికెట్లను విడుదల చేయలేదు. వీటిని డిసెంబరు నెలలో విడుదల చేయనున్నారు.

నేరాల నియంత్రణకు కమాండ్ కంట్రోల్ యూనిట్లు

కుప్పం నుంచి ప్రయోగాత్మకంగా అమలు - ఎస్పీ మణికంఠ చందోలు


వి.కోట పోలీసుస్టేషన్ వద్ద ఎస్పీ మణికంఠ చందోలు

వి.కోట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేరాల అదుపునకు కమాండ్ కంట్రోల్ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. గురువారం కుప్పం, శాంతిపురం, వి.కోట పోలీస్ స్టేషన్లను తనిఖీ చేసిన ఆయన సరిహద్దులో నిఘా ముమ్మరం చేయాలని సూచించారు. నేరాలు జరిగిన తర్వాత వాటిని కట్టడి చేయడం కంటే వాటిని జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం మంచిదన్నారు. అందులో భాగంగా కుప్పంలో అడుగడుగునా పోలీసు నిఘా, సాంకేతికతో కూడిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పూర్తి స్థాయిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిరంతరం నిఘా ఉంచి ప్రతి నేరాన్ని అంతరం చేసేలా సాంకేతికత అందుబాటులోకి తెస్తామన్నారు. 24 గంటలపాటు ఈ వ్యవస్థను ఓ కానిస్టేబల్ ద్వారా పర్యవేక్షిస్తామన్నారు. ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికార్డింగ్ కెమెరాలు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ సీసీ కెమెరాల వల్ల రోడ్డు ప్రమాదాలతోపాటు, ఇతర నేరగాళ్ల వాహనాలను సులభంగా గుర్తించవచ్చన్నారు. తద్వారా నేరాలు పూర్తిగా అదుపులోకి వస్తాయన్నారు. ఇటీవల వి.కోట ఘటనలో పలమనేరు డీఎస్పీ, ఓ జర్నలిస్టుతోపాటు ఓ ఎస్‌బీ పోలీసు గాయపడిన కేసులో పురోగతిని సీఐతో అడిగి తెలుసుకున్నారు. ఇతర కేసులు అరెస్టులు, మిగిలిన కేసుల పురోగతిని సమీక్షించారు. వి.కోటలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని సీఐని ఆదేశించారు. కార్యక్రమంలో సీఐ సోమశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ బాబు, ఏఎస్‌ఐ జయకృష్ణ, ఇతర ఇబ్బంది ఉన్నారు.

‘షీ-బాక్స్’ ఏర్పాటు చేయండి

● కలెక్టర్‌కు వినతి


కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేస్తున్న ప్రభుత్వ మహిళా ఉద్యోగులు

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా ఉద్యోగులపై విధినిర్వహణ ప్రాంతాల్లో జరుగుతున్న వేధింపులపై నిర్భయంగా ఫిర్యాదు చేసేందుకు కలెక్టరేట్‌తో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద షీ-బాక్స్ ఏర్పాటు చేయాలని ఏపీజేఏసీ అమరావతి జిల్లా మహిళా విభాగం అభ్యర్థించింది. ఈ మేరకు రాష్ట్ర, జిల్లా సంఘాల కార్యవర్గ సభ్యులు కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. మహిళా ఉద్యోగులపై లైంగిక వేధింపులు, అత్యాచార యత్నాలు జరుగుతున్న నేపథ్యంలో నేరుగా వీటిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. ఇటీవల సీఎం చంద్రబాబుకు ఇదే అంశంపై విన్నవించామన్నారు.కలెక్టర్ స్పందిస్తూ త్వరలో జిల్లా కార్యాలయాలతో పాటు మండలాల్లోని ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో సైతం షీ-బాక్స్ ఏర్పాటు చేసేందుకు ఆదేశిస్తానని హామీ ఇచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో.. ఏపీ జేఏసీ అమరావతి మహిళా సంఘం చైర్‌పర్సన్ శివకుమారి, ప్రధాన కార్యదర్శి పి.విజయలక్ష్మి, జిల్లా జేఏసీ చైర్‌పర్సన్ ఆర్.జయంతి, ప్రధాన కార్యదర్శి వీఎస్ పుష్పలత, కో-చైర్‌పర్సన్ లత, కార్యదర్శి సరిత, నాలుగు డివిజన్ల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పులి మృతిపై లోతుగా విచారణ

● పొలంలో తొలుత విద్యుదాఘాతం, ఆపై చంపేశారు

● త్వరలో మీడియా ముందుకు నిందితులు : డీఎఫ్‌వో



మీడియాతో మాట్లాడుతున్న డీఎఫ్‌వో భరణి - శ్రీగంధం ముక్కలు, ఆయుధాలు


పులి అవశేషాలు

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పులివేటలో మరింత లోతుగా విచారణ చేపట్టనున్నట్లు డీఎఫ్‌వో భరణి తెలిపారు. యాదమరి మండలం తాళ్లమడుగులో పులి చనిపోయిన ఘటన వివరాలను గురువారం పశ్చిమ ఎఫ్‌ఆర్‌వో కార్యాలయంలో మీడియాకు తెలిపారు. రైతు పొలంలో అడవి జంతువులను వేటాడటానికి అక్రమంగా వేసిన విద్యుత్ తీగల ఉచ్చులో పులి చిక్కింది. విద్యుదాఘాతంతో చనిపోయే స్థితిలో ఉన్న పులిని స్థానికులు చంపినట్లు పోస్టుమార్టం రిపోర్టులో తేలిందన్నారు. దాంతో పొలం యజమానిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించావున్నారు. మరో ఇద్దరు కూడా ఈ ఘటనలో ప్రమేయం ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వీరిని విచారించగా.. బంగారుపాళ్యం వెలుతురుచేను గ్రామానికి చెందిన మరో ఇద్దరు వ్యక్తులు కూడా ఈ ఘటనలో ఉన్నట్లు తేలిందన్నారు. మొత్తం ఐదుగురిని అదుపులోకి తీసుకుని లోతుగా విచారిస్తున్నామని తెలిపారు. అలాగే వారి వద్ద నుంచి పులి అవశేషాలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. త్వరలోనే నిందితులను మీడియా ముందు ఉంచుతామని తెలిపారు. చెన్నైకి చెందిన క్రైం బ్యూరో రాజశేఖర్‌తోపాటు స్థానిక పోలీసుల సహకారం తీసుకున్నామన్నారు.

శ్రీగంధం విక్రయం కేసులో ముగ్గురి అరెస్టు

చిత్తూరు నగరంలో శ్రీగంధం అక్రమ విక్రయాల కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్లు డీఎఫ్‌వో తెలిపారు. అటవీ పశ్చిమ విభాగం సిబ్బందికి వచ్చిన సమాచారంతో ఈనెల 20న విచారణ చేయగా, నగరానికి చెందిన విజయకుమార్, చిత్తూరు రూరల్‌కు చెందిన రాజేంద్ర, గణేష్‌లను అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. వీరి వద్ద నుంచి నాలుగు కిలోల శ్రీగంధం స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేసి.. రిమాండ్‌కు తరలించినట్లు డీఎఫ్‌వో వివరించారు. సమావేశంలో పశ్చిమ ఎఫ్ఆర్వో బాలకృష్ణారెడ్డి, డీఆర్వో ఆనందరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

కుప్పంలో నేడు ‘పీజీఆర్ఎస్’

చిత్తూరు అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని శుక్రవారం కుప్పం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు. నియోజకవర్గ, మండలస్థాయి అధికారులందరూ తప్పక హాజరుకావాలని కోరారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వసతి సముదాయానికి రూ.6.50 లక్షల విరాళం


దాతకు జ్ఞాపికను అందిస్తున్న కోదండపాణి

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కాణిపాక క్షేత్రంలో వసతి సముదాయానికి పల్నాడు జిల్లా నరసారావుపేటకు చెందిన శ్రీనివాసరావు గురువారం రూ.6,50,000 విరాళంగా అందించారు. దాతలను సూపరింటెండెంట్ కోదండపాణి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి.. స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

25 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి బలమైన వర్షం కురిసింది. అత్యధికంగా వెదురుకుప్పంలో 45.2, అత్యల్పంగా చౌడేపల్లెలో 2మి.మీ వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా.. గంగవరంలో 34.6, ఎస్ఆర్‌పురంలో 33.6, కుప్పంలో 29, రామకుప్పంలో 22.2, శాంతిపురంలో 20.8, పూతలపట్టులో 20.4, గుడుపల్లెలో 20.2, గుడిపాలలో 19.2, పలమనేరులో 15.4, బైరెడ్డిపల్లెలో 13.4, తవణంపల్లెలో 13, యాదమరిలో 12.6, బంగారుపాళ్యంలో 12, పెద్దపంజాణిలో 10.6, కార్వేటినగరంలో 9.6, పెనుమూరులో 9.4, పాలసముద్రంలో 7.6, గంగాధరనెల్లూరు 7.4, ఐరాలలో 7.2, చిత్తూరు రూరల్‌లో 5.8, చిత్తూరు అర్బన్, వి.కోటలో 5.6, పులిచెర్లలో 2.8 మి.మీ వర్షపాతం నమోదైంది.

జిల్లేడుపల్లెలో ‘వైసీపీ’ దాష్టీకం

● అంగన్వాడీ కేంద్రం నిర్వహిస్తున్న భవనంలోకి సచివాలయం తరలింపు

● అక్కడున్న పిల్లలను ఉరుస్తున్న పంచాయతీ భవనంలోకి..!

● ఆందోళనలో తల్లిదండ్రులు


ఉరుస్తుండడంతో పాత్రలు పెట్టిన దృశ్యం


పెచ్చులూడిన పంచాయతీ భవనం

బంగారుపాళ్యం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారినా వైసీపీ శ్రేణుల దాష్టీకం ఆగడం లేదు. బంగారుపాళ్యం మండలంలోని జిల్లేడుపల్లె పంచాయతీ భవనంలో సచివాలయం నిర్వహిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ భవనం పెచ్చులూడి, ఉరుస్తుండటంతో కంప్యూటర్, రికార్డులు తడుస్తున్నాయి.



ఆరుబయట అంగన్వాడీ పిల్లలు

మరోవైపు సచివాలయ సిబ్బంది కూడా భయపడుతున్నారు. బుధవారం తంబుగానిపల్లె, మంగళపల్లె పంచాయతీకి గ్రామస్తులు మూడు గ్రామాలకు అనువైన రైతు సేవా కేంద్రానికి సచివాలయాన్ని తరలించడానికి ప్రయత్నించారు. దీన్ని జిల్లేడుపల్లెకు చెందిన వైసీపీ సానుభూతిపరులు అడ్డుకున్నారు. ఎంపీడీవో, ఇన్‌చార్జి ఎంపీడీవో, పోలీసులు వచ్చి సర్దిచెప్పినా వైసీపీ సానుభూతి పరులు వినలేదు. స్థానిక సర్పంచ్ ఆధ్వర్యంలో అధికారుల మాట కూడా ఖాతరు చేయకుండా అదే గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మిద్దెపైన ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని ఖాళీ చేయించి.. సచివాలయ ఫర్నిచర్‌ను తరలించేశారు. అక్కడున్న పిల్లలను ఉరుస్తున్న పంచాయతీ భవనంలోకి పంపేశారు. గురువారం ఆ పిల్లలు భవనంలోకి వెళ్లలేక ఆరుబయటే చదువుకుంటూ కనిపించారు. ఏదైనా ప్రమాదం జరిగితే పిల్లల మాటేంటని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎంఈవో నాగేశ్వరరావును వివరణ కోరగా.. ఈ విషయంలో తనకెలాంటి సమాచారం లేదన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

బస్సు సర్వీసులు ప్రారంభం



పలమనేరు, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు డిపో నుంచి 7 కొత్త సర్వీసులను గురువారం ఎమ్మెల్యే అమరనాథరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఇందులో నాలుగు పల్లెవెలుగు బస్సులు కాగా మరో మూడు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు. భవిష్యత్తులో మరో 9 బస్సులు డిపోకు రానున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఈ డిపో నుంచి పలు బస్సులు ఇతర డిపోలకు బదలాయించడంతో ఇక్కడ బస్సులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతూ వచ్చారు. ఎన్నికల సమయంలో టీడీపీ అధికారం లోకి రాగానే పలమనేరు డిపోకు పూర్వవైభవం తీసుకొస్తానని ఎమ్మెల్యే ప్రజలకు హామీ ఇచ్చారు. ఆ హామీని నేడు నిలుపుకొన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ టీకే స్వామి, టీడీపీ నాయకులు ఆర్వీబాలాజి, ఆర్బీసీకుట్టి, గిరిబాబు, నాగరాజు, ఖాజా, శ్రీధర్, చిన్ని, కిరణ్, బీఆర్సీకుమార్, సుబ్బు సీను, రూరల్ నాయకులు నాగరాజరెడ్డి, రామ్మూర్తి నాయుడు, జనసేన నాయకులు అరుణ్, పాల్గొన్నారు. అలాగే నూతన బస్సు సర్వీసులను ప్రారంభించిన ఎమ్మెల్యేను పలమనేరు పరిరక్షణ సమితి నాయకులు శాలువాకప్పి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పీపీఎస్ నాయకులు నరసింహులు, సుబ్రమణ్యంపిళ్లై, పొన్నుడి, దేవరాజులు, రెడ్డెప్ప, విజయ్‌కుమార్, నారాయణ, దొరస్వామి తదితరులు పాల్గొన్నారు.

మృతదేహాలను పరిశోధనలకివ్వడం ఉదాత్త కార్యం



పీఈఎస్‌లో కడావర్ ఓత్ చేస్తున్న వైద్య విద్యార్థులు

కుప్పం, అక్టోబరు 24: మృతదేహాలను వైద్య పరిశోధనల నిమిత్తం వైద్య సంస్థలకు విరాళంగా ఇవ్వడం ఉదాత్తమైన కార్యమని కుప్పం పీఈఎస్ వైద్య కళాశాల డీన్ అండ్ ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్ఆర్.కృష్ణారావు అన్నారు. కుప్పంలోని పీఈఎస్ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ విద్యార్థులకు గురువారం వైట్ కోట్ సెర్మనీ, క్యాడావరిక్ ఓత్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణారావు మాట్లాడుతూ దాతలు విరాళంగా ఇచ్చిన మృతదేహాలు వైద్య విద్య, పరిశోధనలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. పురాతన కాలంలో అనాటమీ అధ్యయనాలు జరిగిన తీరు, అనంతరం అభివృద్ధి చెందిన విధానం తెలియజెప్పారు. అనాటమీ ప్రొఫెసర్ డాక్టర్ కె.సుజాత క్యాడావరిక్ ఓత్‌ను అందజేశారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంటు డాక్టర్ సుబ్రహ్మణ్య, విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, ఫస్టియర్ ఎంబీబీఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఇరికిపెంటలో వాటర్ ప్లాంట్‌కు మోక్షం

సోమల, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): సోమల మండలం ఇరికిపెంటలో వాటర్ ప్లాంట్‌కు మూడేళ్ల అనంతరం టీడీపీ నాయకుల చొరవతో మోక్షం కలిగింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి జడ్పీ చైర్‌పర్సన్ గీర్వాణి జడ్పీ నిధులతో ఇరికిపెంటలో నీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. స్థానికులు రూ. 2 చెల్లించి బిందె నీరు తీసుకెళ్లేవారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మరమ్మతులకు గురికావడంతో మూతపడింది. అప్పటి నుంచి శుద్ధినీరును ప్రైవేటు వ్యక్తుల వద్ద లీటరుకు రూ.20 చెల్లించి కొనుగోలు చేస్తూ వచ్చారు. ఈ క్రమంలోనే ఇరికిపెంట టీడీపీ నాయకులు చొరవ తీసుకుని పంచాయతీ నిధులు వ్యయం చేసి నీటిశుద్ధి యంత్రానికి మరమ్మతులు చేయించారు. గురువారం పూజలు జరిపి శుద్ధినీటి సరఫరాకు చర్యలు తీసుకున్నారు. మాజీ సర్పంచు శ్రీనివాసులు నాయుడు, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు కొల్లా కోటీశ్వరరావు, చంద్రశేఖర్ నాయుడు, మమత పాల్గొన్నారు.

గంగమాంబ ఆలయ హుండీ చోరీ



వి.కోట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కృష్ణాపురం పంచాయతీ యడగురికి గ్రామంలోని పెద్దపులి గంగమాంబ ఆలయంలో బుధవారం రాత్రి దుండగులు హుండీని పగులగొట్టి నగదు చోరీ చేసుకువెళ్లారు. ఆలయ ప్రధాన ద్వారాన్ని తొలగించి. ఆపై హుండీ ముందు భాగంలోని తాళాన్ని తొల గించారు. లోపల ఉన్న తాళాన్ని చాకచక్యంగా కోసి ఆపై అందులోని నగదును దొచుకెళ్లారు. సుమారు రూ. 50 వేలకు పైగా నగదు ఉండవచ్చని గ్రామస్తులు సీఐ సోమశేఖర్‌రెడ్డి కి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మండల పరిధిలో వారం రోజులుగా ఓ ముఠా గ్రామీణ ప్రాంతా ల్లోని ఆలయాలను లక్ష్యం గా చేసుకుని చోరీలకు పాల్పడుతోంది. నాలుగు రోజుల క్రితం మర్రిమాకు లపల్లె గంగమాంబ ఆల యంలో హుండీని పగుల గొట్టి నగదుతో ఉడాయించారు. మరునటి రోజు వెంకటేపల్లె ఆంజనేయస్వామి ఆలయంలో గేటును తొలగించి హుండీని తస్కరించుకు వెళ్లారు. రెండు రోజుల క్రితం దానమయ్యగారిపల్లె వినాయకుడి ఆలయ హుండీని పగులగొట్టారు. తాజాగా యడగురికిలో గంగమ్మ ఆలయంలో హుండీని పగులగొట్టి పెద్ద మొత్తం చోరీకి గురైంది.

చినుకు పడితే బురదమయం



కల్లూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పులిచెర్ల-కల్లూరు మార్గంలో పాత ఎంపీడీవో కార్యాలయం సమీపంలో రైల్వే అండర్ బ్రిడ్జి దాటాలంటే ప్రయాణికులు నరకం చూస్తున్నారు. ఈ రహదారిపై నిత్యం వాహనాల రాకపోకలు ఉంటాయి. వర్షం పడితే చాలు బ్రిడ్జి కింద మోకాటిలోతు నీళ్లు నిలిచిపోతుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి తక్షణం బ్రిడ్జి కింద భాగంలో నీళ్లు నిలవకుండా మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

శాంతిపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : తుమ్మిశి ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నగేష్ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 26వ తేదీలోగా ఐటీఐ.ఎస్ఐసి.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 27న ఒరిజినల్ సర్టిఫికెట్స్, 28న కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

నాయీబ్రాహ్మణులకు నామినేటెడ్ పోస్టులపై హర్షం

కుప్పం, అక్టోబరు 24: రాష్ట్రంలోని ఆలయ కమిటీలలో నాయీ బ్రాహ్మణులకు నామినేటెడ్ పోస్టుల భర్తీకి క్యాబినెట్ తీసుకున్న నిర్ణయం పట్ల టీడీపీ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సాధికార సమితి అధ్యక్షుడు వైద్యం శాంతారాం హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని నాయీ బ్రాహ్మణులందరూ చంద్రబాబుకు రుణపడి ఉంటారని హామీ ఇచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సదుం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెరుకువారిపల్లె బలిజపల్లె సబ్-స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం నాయనపాకాల, బలిజపల్లె గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 4గంటల వరకు అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని ఏఈ చంద్రశేఖర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.


లబ్ధిదారుల ఎంపికకు సర్వే

శాంతిపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ పథకాలు అందించేందుకు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయడానికి ఇంటింటా సర్వే చేపడుతున్నట్లు ఎంపీడీవో ఏపీఆర్ కుమార్ తెలిపారు. పెన్షన్లు, తాగునీటి కుళాయిలు, సోలార్ విద్యుత్, ఉచిత గ్యాస్, పక్కా గృహాలు, వ్యవసాయ బోర్లకు సోలార్ విద్యుత్ అందించేందుకు సచివాలయ సిబ్బంది సర్వే చేపడతారన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

శాంతిపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో దోముల నివారణకు ఫాగింగ్ చేస్తున్నట్లు ఎంపీడీవో ఏపీఆర్ కుమార్ తెలిపారు. గురువారం ఈవోపీఆర్డీ రవి నాయక్ ఆధ్వర్యంలో బోయనపల్లె, కెనమాకులపల్లె, దండికుప్పం, 121పెద్దూరు, అనెకర, 64పెద్దూరు, కొలమడుగు, సి బండపల్లె, కర్లగట్ట, చెంగుబల్ల గ్రామాల్లో ఫాగింగ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జయరాం, పంచాయతీ కార్యదర్శి అశ్వత్‌నారాయణ, బంగారునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి ఆవరణలో శ్రీగంధం చెట్టు మాయం



పుంగనూరు రూరల్, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి) పుంగనూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆవరణలో శ్రీగంధం చెట్టు రాత్రికిరాత్రే మాయం కావడంతో సిబ్బంది అవాక్కయ్యారు. ఆసుపత్రి ముందు భాగంలో సీసీ కెమెరా ఉన్నప్పటికీ శ్రీగంధం చెట్టు ఎలా మాయం అయిందని సిబ్బంది గుసగుసలాడుతున్నారు. ఈ విషయంపై ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ మధుసూదనాచారి తహసీల్దార్ రాము, అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అటవీశాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని చెట్టు మాయంపై ఆరా తీశారు.

బాలికల పాఠశాలలో జడ్జి తనిఖీలు



కుప్పం, అక్టోబరు 24: కుప్పం పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలను గురువారం కుప్పం ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఆరీఫా షేక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో సంభాషించి వారి సమస్యలను ఆరా తీశారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థినుల భద్రత తదితర అంశాలపై కూడా వివరాలు తెలుసుకున్నారు.

ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ



కుప్పం, అక్టోబరు 24: కుప్పం 9వ వార్డుకు చెందిన అమరావతి కాలనీలో గురువారం తాగునీటి ట్యాంకు ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ భూమి పూజ చేశారు. కాలనీలోని ప్రతి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, జనసేన నియోజకవర్గ కో ఆర్డినేటర్ నరేశ్, కూటమి నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

సత్యమ్మ ఆలయంలో మండల పూజ

కల్లూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం పాళెం పంచాయతీ కొంగరవారిపల్లిలో నూతన సత్యమ్మ ఆలయంలో గురువారం మండల పూజ నిర్వహించారు. ఉదయం గంగస్వీకరణ, కలశస్థాపన, హోమం, అభిషేకాలు, ప్రత్యేకపూజలు నిర్వహించారు. మహిళలు పొంగళ్లతో చేరుకుని అమ్మవారికి నైవేద్యం, చీరలు, పసుపు, కుంకుమ, గాజులు, పూజాసామగ్రి సమర్పించారు.

నేడు మాతమ్మ విగ్రహ ప్రతిష్ఠ

కల్లూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం రేణుమాకులపల్లిలో నూతనంగా నిర్మించిన మాతమ్మ ఆలయంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ వేడుకల్లో పెద్దఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

విద్యార్థుల ఇండస్ట్రియల్ విజిట్



పలమనేరు, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల 10 వతరగతి విద్యార్థులు గురువారం వృత్తి విద్యలో భాగంగా టీఎస్ అగ్రహారం సచివాలయాన్ని సందర్శించారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీపై అవగాహన కోసం వచ్చిన విద్యార్థులకు సచివాలయ మహిళా పోలీసు జోత్స్న సచివాలయం పనితీరు, ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు షంషీర్, ఒకేషనల్ కంప్యూటర్ ట్రయినర్ శివశంకర్‌రుద్ర, సైన్సు ఉపాధ్యాయులు వెంకటరామయ్య, ఒకేషనల్ అగ్రికల్చర్ ట్రయినర్, అభిలాష్ పాల్గొన్నారు.

వంక అక్రమణపై సర్వే

చౌడేపల్లె, అక్టోబర్24:(ఆంధ్రజ్యోతి)చిట్రెడ్డిపల్లె చెరువు వంక అక్రమణపై సర్వే చేసినట్లు తహసీల్దార్ హనుమంతు పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. చెరువు ఆయకట్టు రైతులు ఈనెల 21న చిత్తూరు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారన్నారు. కలెక్టర్ ఆదేశాలతో సర్వే నిర్వహించగా అక్రమణలు జరిగినట్లు గుర్తించామన్నారు. 3 రోజులలో అక్రమణలు తొలగించాలని ఆదేశించినట్లు తెలిపారు. వీఆర్‌వోలు శ్రీపతిరెడ్డి, విజయకుమార్‌రెడ్డి, సర్వేయర్లు పద్మజ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

పుంగనూరు రూరల్, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): స్థానిక శుభారాం ప్రభుత్వ డిగ్రీకాలేజీ ఆవరణలో గురువారం మానవత సంస్థ, రోటరీక్లబ్ ఆధ్వర్యంలో మదనపల్లె బ్లడ్ బ్యాంక్ సిబ్బందిచే రక్తదాన శిబిరం నిర్వహించారు. కాలేజీ ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు, ఎంసీవీ కాలేజీ విద్యార్థుల ద్వారా 52 యూనిట్ల రక్తం సేకరించారు. కార్యక్రమంలో మానవత సంస్థ చైర్మన్ నందీశ్వరయ్య, సంస్థ ప్రతినిధులు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, కో ఆర్డినేటర్ సోమశేఖర్, రోటరీక్లబ్ ప్రతినిధులు డాక్టర్లు ప్రభాకర్, వి.విజయకుమారి, సరస్వతి, పూల త్యాగరాజు, హరి, నారాయణరెడ్డి, శరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన పుంగనూరు టీడీపీ నేతలు



పుంగనూరు రూరల్, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడును పుంగనూరు టీడీపీ నాయకులు బుధవారం విజయవాడ కనకదుర్గమ్మ ఆలయం వద్ద కలిశారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షుడు రెడ్డెప్పనాయుడు, నాయకులు సుబ్రహ్మణ్యం, శంకర్ పాల్గొన్నారు.

సమగ్ర సర్వేతోనే సమస్యలు

సదుం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో చేపట్టిన భూసర్వేతోనే ప్రతి గ్రామంలోనూ భూసమస్యలు అధికమయ్యాయని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. చెరుకువారిపల్లెలో గురువారం రెవెన్యూ గ్రామసభ జరిగింది. స్థానికుల నుంచి 120 అర్జీలు రాగా అందులో జాయింట్ ఫీల్డ్ 70, విస్తీర్ణంలో వ్యత్యాసం 27, పాసు పుస్తకాలలో పేర్ల మార్పుల కోసం 22 అర్జీలు అందినట్లు డీటీ కుమార్ తెలిపారు. సర్పంచ్ సరస్వతి, సర్వేయర్ సతీశ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వరుస వర్షాలకు టమో'రా'





మార్కెట్‌కు తరలించడానికి టమోటాలను బాక్స్‌లకు నింపుతున్న రైతు, వర్షానికి దెబ్బతిన్న టమోట పంట

పుంగనూరు రూరల్, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు **ప్రధానంగా** టమోటా పంటలు నాశనమై రైతులు గగ్గోలు పెడుతున్నారు. ధరలు పెరుగుతున్న సమయంలో తరచూ వర్షాలు పడడం, గాలిలో తేమ శాతం పెరగడం, భూమిలో నీరు చేరి పంటలు నిలువునా మాడిపోతున్నాయి. **టమోటా సాగుకు పుంగనూరు మండలంలో అనుకూల వాతావరణం ఉండటంతో** దాదాపు 1500 ఎకరాల్లో టమోటా సాగు చేసినట్లు హార్టికల్చర్ అధికారి వరప్రసాద్ తెలిపారు. ప్రస్తుత వర్షాల కారణంగా దాదాపు 100 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు తెలు స్తోంది. ఎకరా సాగుకు దాదాపు రూ. 2లక్షలు ఖర్చు చేసి పంటలు పండిస్తే దిగుబడి చేతికి వచ్చే సమయానికి ధరలు తగ్గిపోవడం, తెగుళ్లు వచ్చి పంటలు దెబ్బతీయడంతో రైతులు ఆందోళన చెందు తున్నారు. తుపాన్ వెళ్లిపోయిందని, ఉన్న టమోటాలు మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయించుకోవాలని భావిస్తుండగా మళ్లీ తుపాన్ వస్తోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పంట చేతికి వచ్చే సమయంలో...



కొద్దిరోజులుగా టమోట ధరలు పెరగడంతో మార్కెట్‌కు తీసుకెళుదామంటే వర్షాలతో పూర్తిగా దెబ్బతిన్నాయి. గత ప్రభుత్వం సబ్సిడీపై ఎరువులు ఇవ్వకపోవడం, వ్యవసాయ పరికరాలు ఇవ్వకపోవడంతో చాలా ఇబ్బందులు పడ్డాం. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే డ్రిప్ పరికరాలు సబ్సిడీ ధరలతో ఇవ్వడంతో నగం పెట్టుబడులు మిగిలాయి. ప్రభుత్వం డ్రిప్, ఎరువుల ధరలు తగ్గించాల్సివుంది. - వెంకటరెడ్డి, రైతు, బండ్లపల్లె

రైతులకు సబ్సిడీలు అందించాలి



రైతులకు సబ్సిడీలు ఇవ్వడం వల్ల పంటలు సాగుచేయడానికి అవకాశం ఉంది. ఎరువుల ధరలు పెరగడం, కూలీల రేట్లు పెరగడం వల్ల రైతులు వ్యవసాయం చేయడానికి ఇబ్బందిగా ఉంటుంది. టమోటా పంటకు ధరలు లేని సమయాల్లో ప్రభుత్వం గిట్టుబాటు ధరకు పంట కొనుగోలు చేయాలి. వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులకు పరిహారం ఇచ్చి ప్రోత్సహించాలి. - మోహన్‌రెడ్డి, రైతు, నల్లగుట్లపల్లె

శాంతిపురంలో అవుట్ పోస్టు పునఃప్రారంభం



ఔట్ పోస్టులోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

శాంతిపురం, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి) : శాంతిపురం అవుట్ పోస్టును ఎస్పీ **మణికంఠ చందోలు** గురువారం పునః ప్రారంభించి అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. వాటి సామర్థ్యం, పనితీరు ను టెక్నీషియన్ మురళీని అడిగి తెలుసు కున్నారు. ఎక్కడెక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారో రాళ్ళబూదుగూరు ఎస్ఐ నరేష్ వివరించారు. సీసీ కెమెరాలు ఏర్పాటుకు స్థానిక నాయకులు, వ్యాపారులు సహకరించారని సీఐ మల్లేష్ యాదవ్ ఎస్పీకి తెలిపారు. రాళ్ళబూదుగూరు పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలంటే ఇక్కడి ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి వారి కోసం ఇక్కడే కొంత మంది పోలీస్ సిబ్బందిని నియమించాలని కోరారు. ఎక్కడచూసినా గంజాయి మత్తులో యువత తుల్లుతున్నారని, అలాంటి వ్యసనాలపైన గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి యువతను కాపాడాలని ఎస్పీని స్థానికులు కోరారు. త్వరలోనే వాటిపై దృష్టి సారిస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. తరువాత సీసీ కెమెరాల ఏర్పాటుకు శ్రమించిన హోంగార్డ్స్ కృష్ణమూర్తి, మురుగేష్, బాలసుబ్రమణ్యం, గంగాధరంలకు క్యాష్ రివార్డులను ఎస్పీ ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ పార్థసారథి, మండల టీడీపీ అధ్యక్షుడు విశ్వనాథ నాయుడు, మాజీ ఎంపీపీ ఉదయకుమార్ నాయుడు, నాయకులు విజయరామిరెడ్డి, చంద్రశేఖర్, అనుసూయ, నాగరాజు, జయరామిరెడ్డి, పీవీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో స్నేహభావంగా మెలగాలి : ఎస్పీ

గుడుపల్లె, అక్టోబరు 24, (ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజల పట్ల పోలీసులు స్నేహభావంతో మెలగాలని ఎస్పీ **మణికంఠ చందోలు** అన్నారు. గురువారం గుడపల్లె పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి క్రైమ్ రికార్డులు, కేసు డైరీలను పరిశీలించి సూచనలు చేశారు. సాంకేత పరిజ్ఞానం ఉపయోగించి కేసుల విచారణ త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. రాత్రి వేళల్లో నిరంతరం నిఘా ఉంచి నేరాలను అదుపుచేయడానికి కృషి చేయాలన్నారు. అంతకముందు ఆయన మల్లప్పకొండపై వెలసిన మల్లేశ్వర స్వామిని దర్శించుకున్నారు. కుప్పం డీఎస్పీ పార్థసారది, కుప్పం రూరల్ సీఐ మల్లేష్‌యాదవ్,అర్బన్ సీఐ జీటీ నాయుడు ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

మా దుకాణాలను దౌర్జన్యంగా లాక్కొన్నారు

బోయకొండ టెండరుదారు ఆవేదన



మాట్లాడుతున్న గంగిరెడ్డి

చౌడేపల్లె, అక్టోబర్24 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండలో తమ దుకాణాలను కొందరు వ్యక్తులు దౌర్జన్యంగా లాక్కున్నారని బోయకొండకు చెందిన గంగిరెడ్డి ఆరోపించారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆలయ అధికారులు మార్చిలో నిర్వహించిన వేలం పాటలో కొండపైన కూల్‌డ్రింక్స్, క్యాంటీన్ నిర్వహించుకునే హక్కును రూ.20.10లక్షలతో తాను దక్కించుకున్నానన్నారు. అలాగే కొండ కింద చికెన్ అంగడిని రూ.4.50లక్షలతో దక్కించుకున్నానన్నారు. అలాగే దిగువపల్లె పంచాయతీ అధికారులు నిర్వహించిన వేలం పాటలో కే. రమణతో కలసి రూ.7.50లక్షలతో మరో చికెన్ అంగడి, మరో వ్యక్తి ప్రసాద్‌తో కలసి రూ.6.43లక్షలతో మరో చికెన్ అంగడిని దక్కించుకున్నట్లు తెలిపారు. అయితే మే నెల మొదటి వారంలో కొందరు స్థానిక నాయకులు తమ దుకాణాలన్నీ దౌర్జన్యంగా లాక్కుని వ్యాపారాలు చేసుకుంటున్నారన్నారు. ఆలయ అధికారులకు, పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని తెలిపారు. దౌర్జన్యంగా షాపులు లాక్కున్న వారు మా టెండర్ డబ్బులైన ఇవ్వాలని, లేకపోతే ఆత్మహత్యే శరణ్యమని వాపోయారు. జిల్లా అధికారులైన స్పందించి తమకు న్యాయం చేయాలని ఆయన వేడుకున్నాడు. కార్యక్రమంలో రమేష తదితరులు ఉన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటే సహించం : టీడీపీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పలమనేరు, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి) : అధికారులను బెదిరించి మండలంలో అభివృద్ధి పనులను అడ్డుకుంటే ఊరుకోమని మండల టీడీపీ నాయకులు పేర్కొన్నారు. గురువారం పలమనేరులో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అభివృద్ధి పనుల విషయంలో ఎంపీపీని అడ్డుపెట్టుకొని వైసీపీ నేతలు ఎంపీడీఓ ఖాదర్‌బాషాపట్ల దురుసుగా ప్రవర్తించడాన్ని టీడీపీ నేతలు తప్పుపట్టారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక నిరాధారణ ఆరోపణలు చేసి పనులను అడ్డుకోవడం తగదన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు లక్ష్మీనారాయణ, నాగరాజరెడ్డి, రామ్మూర్తినాయుడు, గణేష్, సీనియర్ నాయకులు ధనంజయరెడ్డి, మల్లేశ్వరరెడ్డి, వెంకటరమణ, పెద్దబ్బ, సెల్వరాజు, అమరనాథరెడ్డి, స్వతంత్ర్యబాబు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా పుంగనూరు రోడ్లు



డిగ్రీ కాలేజీ సమీపంలో అధ్వానంగా రోడ్డు

పుంగనూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కొద్దిపాటి వర్షం కురిసినా పలుచోట్ల రోడు అధ్వానంగా తయారై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎస్ఎస్‌పేట ఖబరస్తాన్ ఎదుట వర్షం నీరు వెళ్లడానికి సరైన మురుగుకాల్వలు లేక నీరు నిల్వఉంటోంది. దీంతో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, బీడీకాలనీ, ప్రభుత్వ డిగ్రీకాలేజీ, రామసముద్రం వెళ్లే ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఎస్ఎస్ ట్యాంకు రోడ్డు, రాంనగర్ తదితర చోట్ల రోడ్లు పాడై వర్షం కురిస్తే నీరు చేరి ఉన్న గోతులు పెద్దవిగా తయారై వాహనాలు వెళ్లడానికి చాలా సమస్యగా ఉంది. అలాగే చింతలవీధి విస్త రణ ప్రాంతాల్లో సీసీ రోడ్లులేక వర్షం వస్తే రోడ్డు బురదమయంగా మారుతోంది. ఉన్నతాధికారులు స్పందించి రోడ్ల ను బాగుచేయా లని ప్రజలు కోరుతున్నారు.



రాంనగర్ కాలనీ రోడ్డులో గోతుల్లో నిలిచిన వర్షపు నీరు

తాగునీటికి రూ. 49.30 లక్షల నిధుల మంజూరు

శాంతిపురం, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): మండలంలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.49.30లక్షలు నిధులను కలెక్టర్ సుమిత్ కుమార్, కడా పీడీ వికాస్ మర్మత్ మంజూరు చేసినట్లు ఎంపీడీవో ఏపీఆర్ కుమార్ తెలిపారు. మండలంలోని 26 అంగన్వాడీ కేంద్రాల్లో తాగునీటి వసతి కల్పనకు రూ.9.36 లక్షలు నిధులను మంజూరు చేశారని తెలిపారు. మరో 15 అంగన్వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.2.55 లక్షలు మంజూరు చేశారన్నారు. ఎక్కడైతే అవసరమని ప్రజలు వినతి చేశారో అక్కడ త్వరితి గతిన పనులు పూర్తి చేసి తాగునీటి వసతి, మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేయించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, అంగన్వాడీ సీడీపీవో కల్పనకు ఆదేశాలు జారీ చేశామన్నారు. 13 గ్రామాలకు, ఒక పాఠశాలకు, ఒక కళాశాలకు మొత్తం 15చోట్ల తాగునీటి వసతి కల్పనకు రూ.37.5లక్షలు నిధులను మంజూరు చేశారని తెలిపారు. త్వరలోనే ఆయా గ్రామాల్లో కొత్త బోర్లు తవ్వి తాగునీటి సమస్య పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.

ఆధార్ అప్‌డేట్స్‌పై ప్రత్యేక క్యాంపు

సోమల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కందూరు సచివాలయంలో ఆధార్ కార్డులో తప్పులను సరిచేసేందుకు గురువారం ప్రత్యేక క్యాంపు నిర్వహించారు. 120 మంది పలు అంశాలపై మార్పులు చేయించుకున్నట్లు ఎంపీడీవో నారాయణ తెలిపారు. ఈవోపీఆర్డీ లక్ష్మిదేవి, కార్యదర్శులు జయశంకర్, రాజేశ్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బాహుదానదిపై శాశ్వత వంతెనలు నిర్మించండి

తవణంపల్లె, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): బాహుదా నదిపై శాశ్వత వంతెనలు నిర్మించాలని సీఎం చంద్రబాబును టీడీపీ అధికార రాష్ట్ర ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ కోరారు. గురువారం సీఎంను అమరావతిలో కలిసి ఈ మేరకు విన్నవించారు. తవణంపల్లె మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గాజులపల్లె-సరకల్లు గ్రామాలకు వెళ్లే దారిలో బాహుదానదిపై తొడతర వద్ద ఉన్న కల్వర్టు కొట్టుకుపోయిందని తెలిపారు. అలాగే అరగొండ-గాజులపల్లె, అరగొండ-జొన్నగురకుల వెళ్లే దారిలోనూ నదిపై ఉన్న కల్వర్టులు పాక్షికంగా కొట్టుకపోవడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. అందువల్ల శాశ్వత వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రికి విన్నవించారు. అనంతరం దేవదాయశాఖ మంత్రి రామనారాయణరెడ్డిని కలిసి ఇటీవల అరగొండ అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయంలో తొలగించిన కాంట్రాక్ట్ ఉద్యోగులను విధుల్లో చేర్చుకోవాలని వినతి పత్రం ఇచ్చినట్లు సప్తగిరి తెలిపారు.


చంద్రబాబుకు వినతిపత్రమిస్తున్న సప్తగిరి ప్రసాద్

రక్త సంబంధాలను కాలరాస్తున్న జగన్: టీడీపీ

చిత్తూరు సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తల్లీబిడ్డ, అన్నాచెల్లెళ్ల రక్త సంబంధాలను మాజీ సీఎం జగన్.. కాలరాస్తున్నారని చిత్తూరు పార్లమెంటు టీడీపీ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ విమర్శించారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. తండ్రికిచ్చిన మాటకన్నా ఆస్తులు, డబ్బె మాత్రమే తనకు ప్రధానమని.. తల్లీ చెల్లి బంధం తనకు అక్కర్లేదని.. వారిపైనే కేసులు పెట్టడం మనదేశంలో ఏ కొడుకు, ఏ సోదరుడు చేయలేదన్నారు. ఇలాంటి వ్యక్తి ఐదేళ్లపాటు రాష్ట్రాన్ని పాలించాడంటే ఇది ప్రజల దౌర్భాగ్యమని చెప్పారు. నేతలు మోహన్ రాజ్, జాఫర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న కోదండయాదవ్

మౌలిక వసతుల కల్పనే కూటమి ప్రభుత్వ లక్ష్యం

గంగాధరనెల్లూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ కార్యనిర్వాహక జిల్లా కార్యదర్శి ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, యాదవ సాధికారసమితి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, తూగుండ్రం పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ నరసింహులునాయుడు అన్నారు. తూగుండ్రం హైస్కూల్లో చిత్తూరు ఎంపీ నిధులు రూ.5లక్షలతో గురువారం కొత్తగా బోరు డ్రిల్లింగ్‌ను వారు ప్రారంభించారు. హైస్కూల్‌కు దీర్ఘకాలికంగా ఉన్న నీటి సమస్యకు పరిష్కారం లభించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు నియాజ్‌అలీ, జీవరత్నం, నీరజాక్షులురెడ్డి, శాంతకుమార్, శ్రీనివాసులుశెట్టి, రాఘవేంద్ర, కండిగ శంకర్, ముత్తు, కమల్, దాసరపల్లె శంకర్, టీచర్లు పాల్గొన్నారు.


బోరు డ్రిల్లింగ్ ప్రారంభించిన టీడీపీ నాయకులు

క్రీడాకారులకు అభినందన

బంగారుపాళ్యం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): హిందూపురం మున్సిపల్ పరిధిలోని ముదిరెడ్డిపల్లెలో ఈనెల 21, 22, 23 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 బాలబాలికల వాలీబాల్ టోర్నీలో చిత్తూరు జిల్లా బాలుర జట్టు విజేతగా నిలిచింది. బాలికల జట్టు రెండో స్థానంలో నిలిచినట్లు జిల్లా వాలీబాల్ కోచ్ సిరాజ్ అహ్మద్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం బంగారుపాళ్యం వాలీబాల్ క్రీడా మైదానంలో బాలుర జట్టులోని క్రీడాకారులను మాజీ జడ్పీ చైర్మన్ కుమార్ రాజా, మాజీ డీఎస్డీవో సుదర్శన్ నాయుడు, మాజీ వాలీబాల్ క్రీడాకారులు ఎంటీ కృష్ణమూర్తి, మురారి, డిలీప్, పెరుమాళ్, హెచ్ఎం రాజేంద్ర, పీడీలు గిరిజ, విజయ్ కుమార్ అభినందించారు.



ఏపీ జేఏసీ మహిళా విభాగానికి నూతన కార్యవర్గం

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ జాయింట్ యాక్షన్ కమిటీ (ఏపీజేఏసీ) అమరావతి జిల్లా మహిళా విభాగ చైర్మన్‌గా జయంతి (డిప్యూటీ తహసీల్దార్, యాదమరి), కో-చైర్మన్‌గా లత (ఆర్టీసీ, చిత్తూరు), కార్యదర్శిగా వి.ఎం.సరిత (కలెక్టరేట్, చిత్తూరు) ఎంపికయ్యారు. జిల్లా విభాగంలో సర్వశిక్ష, రెవెన్యూ, సహకార శాఖలకు చెందిన 10 మంది వివిధ కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా, నాలుగు రెవెన్యూ డివిజన్లకు సంబంధించిన మహిళా విభాగ కార్యవర్గ ఎన్నికలు గురువారం స్థానిక రెవెన్యూ భవన్‌లో జరిగాయి. ముఖ్య అతిథులుగా రాష్ట్ర సంఘ ప్రధాన కార్యదర్శి పున్నూరు విజయలక్ష్మి, ఛైర్‌పర్సన్ శివకుమారి హాజరయ్యారు. చిత్తూరు డివిజన్ విభాగానికి ఛైర్‌పర్సన్‌గా హిమగిరి, కో-ఛైర్‌పర్సన్‌గా పుష్ప, కార్యదర్శిగా బిందుశ్వేత, ఎనిమిది మంది ఈసీ మెంబర్లుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



జయంతి - సరిత

ఈ రోడ్డుకు మోక్షమెప్పుడు?

గుడిపాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లె క్రాస్ నుంచి సీకే పల్లె మీదుగా వెళ్లే తారు రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ దారిలో నిత్యం వాహనాల రాకపోకలు అధికసంఖ్యలో సాగుతుంటాయి. రాత్రి వేళల్లో గుంతల్లో పడి పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ దారికి మరమ్మతులు చేయాలని సంబంధిత అధికారులకు విన్నవించినా ఫలితంలేదని వాపోతున్నారు. ఇకనైనా సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.


సీకేపల్లెకి వెళ్లే రహదారిలో గుంతలమయంగా ఉన్న తారురోడ్డు

గంగుపల్లె చెరువుకు నీరు

పెనుమూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జలాశయం పూర్తిగా నిండటంతో గంగుపల్లె చెరువుకు నీటిని విడుదల చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో చేపట్టిన సప్లయ్ చానల్‌ను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకుండా బిల్లులు నిలుపుదల చేసింది. గురువారం మాజీ ఎంపీపీ హరిబాబునాయుడు ఆ చానల్‌లో మొక్కలను తొలగించి.. కూలీలతో శుభ్రం చేసి గేటు ద్వారా చెరువుకు నీటిని విడుదల చేశారు. చెరువులోకి నీరు చేరడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వచ్చి పూజలు చేశారు. ప్రతాప్, నరేంద్ర, చిరంజీవి, గుణ, రమేష్ పాల్గొన్నారు.


చెరువు వద్ద పూజలు చేస్తున్న టీడీపీ నేతలు



టేబుల్ టెన్నిస్ జిల్లా జట్ల ఎంపిక

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక బృందావన్ పాఠశాలలో జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ బాల, బాలికల జట్లను ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ వసంత వాణి తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ శైలజ కుమారి, డైరెక్టర్ ప్రియతేజ, ఎస్‌జీఎఫ్ వసంత వాణి మాట్లాడుతూ.. అండర్-17 జట్టు నవంబరు 3 నుంచి 5 వరకు, అండర్-14 జట్టు నవంబరు 9,10 తేదీల్లో నంద్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

జట్లలోని క్రీడాకారులు: అండర్-17 బాల, బాలికల జట్లలో .. అనిల్, పురుషోత్తం, రాముడు, దీక్షిత్‌రెడ్డి, భాను, శాలిని, మహిత, గేయని, సుభాషిణి, నిషిత ఉన్నారు. ● అండర్-14 బాల, బాలికల జట్లలో.. దినేష్, చందు, భవ్యష్, నవనీత్, హర్షిత్, అక్షిత, జ్యోతి, రేఖ, నీతుశ్రీ, దీప్తిమేఘన ఉన్నారు.

మధ్యంతర భృతి
ప్రకటించాలి: ఆపస్

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, ఉద్యోగులకు దీపావళి కానుకగా పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేసిన మధ్యంతర భృతి (ఐఆర్) 30 శాతం ప్రకటించాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా ఆర్థిక బకాయిలు, కరువుభత్యం, ఐఆర్‌లు ఇవ్వాలన్నారు.

ఈ ట్రాఫిక్ సమస్యకు పరిష్కారమెప్పుడు?

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగర పాలక సంస్థగా ఏర్పడి 20 సంవత్సరాలైనా రోడ్ల వెడల్పునకు నోచుకోలేదు. నగరంలోని అన్ని ప్రధాన రహదారుల్లో నిత్యం ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. 2014-19లో అప్పటి ఎమ్మెల్యే డీఏ సత్యప్రభ చొరవతో గాంధీరోడ్డు-వయా సంతపేట రోడ్డు మాత్రం విస్తరణకు నోచుకుంది. ప్రధానమైన హైరోడ్డు, గిరింపేట రోడ్లు అలాగే ఉన్నాయి. వీటి విస్తరణకు నాటి కలెక్టర్ ప్రద్యుమ్న చొరవ చూపినా.. స్థానికులు కోర్టుకు వెళ్లడంతో ఆగిపోయింది. దీనివల్ల నగరంలో ఎంఎస్ఆర్ జంక్షన్ నుంచి జిల్లా కోర్టు వరకు, గిరింపేట చౌడేశ్వరి గుడి నుంచి పీవీకేఎన్ వరకు రోడ్లు వెడల్పు కాకపోవడంతో ప్రజలు, వాహనదారులు, విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఆస్పత్రులకు వెళ్లే రోగులు ట్రాఫిక్ సమస్యను ఎదుర్కొంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి నగరంలో రోడ్లను విస్తరించి, ట్రాఫిక్ సమస్య నుంచి విముక్తి కల్గించాలని ప్రజలు కోరుతున్నారు.


రోజూ ఇంతే: గిరింపేట వద్ద ట్రాఫిక్‌లో చిక్కుకున్న స్కూల్ బస్సులు

ఆన్‌లైన్‌లో సర్వే నెంబర్లు కనిపించడం లేదు
డీబీ పల్లె గ్రామసభలో రైతుల ఆందోళన




డీబీపల్లె, రామకృష్ణాపురం, వీకేఆర్‌పురంలో జరిగిన గ్రామసభలు

గుడిపాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పాస్‌బుక్‌లో పేర్కొన్న సర్వేనెంబర్లు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. రీ సర్వేలో తలెత్తిన సమస్యల పరిష్కారానికి గురువారం మరకాలకుప్పం పంచాయతీ డీబీ పల్లెలో జరిగింది. ఈ సందర్భంగా డీబీపల్లెకు చెందిన సురేంద్ర రెడ్డి సర్వే నెం. 76/1ఈలో 18 సెంట్లు, 1బీలో ఎనిమిది సెంట్లు, 76/2ఏలో 67 సెంట్లు గత ప్రభుత్వంలో రీసర్వే చేసి పాస్‌బుక్ ఇచ్చారన్నారు. ఈ నెంబర్లు ఆన్‌లైన్‌లో లేవన్నారు. అలాగే ప్రశాంత్ రెడ్డి సర్వే నెం. 6/1ఏ, 7/1, 2, 3కి సంబంధించి 1.92 ఎకరాలు నమోదు కాలేదని, కోదండరెడ్డికి సర్వే నెం.78/2, 79, 80/1ఏ, 1బీలో 1.86 ఎకరాలు కూడా కనపడటం లేదన్నారు. ఇప్పటికే పలుమార్లు సంబంధిత అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేదన్నారు. గ్రామసభలోనైనా న్యాయం చేయాలన్నారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ రూపశ్రీ మాట్లాడుతూ.. సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. మాజీ ఎంపీపీ నాగరాజ యాదవ్, మాజీ సర్పంచ్ కోదండ యాదవ్, సర్వేయర్లు గోపినాథ్, కిరణ్, వీఆర్వోలు అరుణ్, దీపక్, గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెనుమూరు: సామిరెడ్డిపల్లి సచివాలయంలో గ్రామసభ జరగ్గా, 19 అర్జీలు అందాయి. తహసీల్దారు శ్రావణ్‌కుమార్, రీసర్వే డీటీ వాణి, మండల సర్వేయర్ చిరంజీవి, వీఆర్వో రేవతి, రైతులు పాల్గొన్నారు.

పాలసముద్రం: రామకృష్ణాపురంలో నిర్వహించిన గ్రామ సభలో రైతుల నుంచి 79 అర్జీలను స్వీకరించారు. జిల్లా సర్వే సహాయ సంచాలకుడు టిజయరాజ్, తహసీల్దార్ అరుణకుమారి, సర్వేయర్ గణేష్, వీఆర్వోలు శ్రీను, రమేష్‌నాయుడు, తంగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: బ్రాహ్మణపల్లెలో గ్రామసభ జరిగింది. వెదురుకుప్పం రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ కోమల, సిబ్బంది పాల్గొన్నారు. ● కార్వేటినగరం మండలం గాజంకిలో గ్రామసభ జరిగింది. తహసీల్దార్ భగవతి, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త క్రషర్లకు అనుమతులు ఇవ్వొద్దు

నగరి: వీకేఆర్‌పురం పంచాయతీ పరిధిలో కొత్తక్రషర్లకు అనుమతులను ఇవ్వొద్దని వీకేఆర్‌పురంవాసులు విన్నవించారు. దామరపాకం, వీకేఆర్‌పురంలో గ్రామసభలు జరిగాయి. ఈ సందర్భంగా వీకేఆర్‌పురం వాసులు మాట్లాడుతూ.. ఇప్పటికే గ్రామం చుట్టూ క్రషర్లతో కాలుష్యం నెలకొందని, ఇళ్లు బీటలు వారుతున్నాయన్నారు. ఇంకా అనుమతులిస్తే గ్రామం వదిలి వెళ్లిపోవాల్సి వస్తుందని వాపోయారు. ఆర్డీవో వెంకటరెడ్డి, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో సతీష్, నాయకులు కృష్ణారెడ్డి,నాగరాజు,నాగేశ్వరరావు,నందిని పలువురు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ పోటీల్లో ఐరాల విద్యార్థుల ప్రతిభ

ఐరాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారని హెచ్ఎం కోమల తెలిపారు. ఇటీవల నంద్యాలలోని డీఎస్ఏ క్రీడా మైదానంలో నిర్వహించిన అండర్-17 పోటీల్లో టీమ్ ఈవెంట్ సాబర్ విభాగంలో మహేష్, రోహిత్, ఈపీఈఈ ఈవెంట్‌లో రంజిత్‌కుమార్ బ్రాంజ్ మెడల్ సాధించారన్నారు. దీనికి కృషి చేసిన పీడీ దేవా, క్రీడాకారులను ఖేలో ఇండియా ఫెన్సింగ్ కోచ్ రాఘవకార్తీక్‌ని ఉపాధ్యాయ బృందంతో కలిసి గురువారం అభినందించారు.



'మరుదు' సోదరులకు నివాళి

చిత్తూరు అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీష్ వారిని ఎదిరించిన యోధులు చిన్న, పెరియ మరుదు అని మొదలియార్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బుల్లెట్ సురేష్ అన్నారు. చిన్న, పెరియ మరుదుపాండ్యులను ఉరి తీసిన రోజు సందర్భంగా గురువారం గంగినేని చెరువు పార్కు వద్ద వారి చిత్రపటాలకు పూజలు చేసి, నివాళి అర్పించారు. మేయర్ అముద, కార్పొరేటర్లు, మొదలియార్ సంఘ నేతలు బొంబాయి సుందరం, శివ, కృష్ణమూర్తి, గుణశేఖర్, గోపి, ఉదయ్, శ్రీధర్, స్టోర్ శివ, వినోద్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



పేదల కోసమే అన్న క్యాంటీన్

గుడిపాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల కుటుంబాల ఆకలి తీర్చడానికే అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసినట్లు టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు బాలాజి నాయుడు అన్నారు. గురువారం గుడిపాల అన్న క్యాంటీన్‌లో దాతల సహకారంతో రూ.5కే భోజనం అందించారు. బీజేపీ నాయకుడు ధనపాల్, టీడీపీ నేతలు షణ్ముగం గౌండర్, గోవింద్ గౌండర్ పాల్గొన్నారు.



అర్జీలపై సత్వరం స్పందించాలి: ఆర్డీవో

యాదమరి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ కొచ్చే అర్జీలపై సత్వరం స్పందించాలని ఆర్డీవో శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం ఆయన మండలం నుంచి అందిన అర్జీలపై సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కారమార్గం చూపారు. తహసీల్దార్ పార్థసారథి, ఆర్ఐ ప్రసాద్, మండల సర్వేయర్ తులసీధర్‌తో కలిసి కుక్కలపల్లెలో జ్యోతి ఇంటి దారి సమస్యను, కీనాటంపల్లెలో మోహన్ భూవివాదంపై గ్రామస్తులతో మాట్లాడి, పరిష్కరించారు.


కుక్కలపల్లెలో దారి సమస్యను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాసులు

రొమ్ము క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రొమ్ము క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలని అపోలో క్యాన్సర్ విభాగాధిపతి సత్యనారాయణ చెప్పారు. రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసాన్ని పురస్కరించుకుని అపోలో యూనివర్సిటీలోని బయోమెడికల్ సైన్స్ విభాగం విద్యార్థులు చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి గాంధీ విగ్రహం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అపోలో మెడికల్ సూపరింటెండెంట్ రంగనాథ్ ఆధ్వర్యంలో ఆస్పత్రిలోని వివిధ విభాగాల్లో రోగులకు అవగాహన కల్పించారు. డాక్టర్లు కళ్యాణి, శ్రీరూప్, విద్యార్థులు పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధి నిర్మూలనకు సహకరించండి

విజయపురం, అక్టోబరు 24: కుష్ఠువ్యాధి నిర్మూలనకు సహకరించాలని లెప్రసీ పారా మెడికల్ ఆఫీసర్ కానిక్‌రాజు పిలుపునిచ్చారు. గురువారం శ్రీహరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కుష్ఠువ్యాధి నివారణకు అవగాహన సమావేశం నిర్వహించారు. హెచ్ఎం జ్ఞానప్రసాద్, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

విజయపురం, అక్టోబరు 24: పంచాయతీ నిధులు దుర్వినియోగం చేస్తున్నారని ఎంపీడీవో రమణప్రసాద్‌కు జీఎంపురం వార్డు సభ్యులు ఫిర్యాదు చేశారు. గ్రామంలో శివాలయం వద్ద మోటరు మరమ్మతుకు గురైతే సర్పంచ్ స్పందించక పోవడంతో గ్రామంలోని సురేష్ పనులు చేసి రికార్డు చేసుకుంటే.. ప్రస్తుత పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌లు నిధులు కాజేశారని ఫిర్యాదు చేశారు. ఎస్టీ శ్మశాన వాటికలో పిచ్చి మొక్కలు, రాళ్లు, చెట్లను రూ.48వేలతో పనులు చేస్తే దానికి రూ.70వేలను డ్రా చేశారని ఆరోపించారు. దీనిపై విచారణ జరిపించాలని కోరారు.

నేటినుంచి నూతన ఆర్టీసీ సర్వీసులు ప్రారంభం

చిత్తూరు సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నూతన ఆర్టీసీ సర్వీసులు శుక్రవారం నుంచి ప్రారంభించనున్నట్లు ఒకటో డిపో మేనేజర్ కృష్ణమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు ప్రజలు, వ్యాపారుల సౌకర్యార్థం ప్రతి సోమవారం ఉదయం 4.15 గంటలకు చిత్తూరు నుంచి చెన్నైకి ఓ సర్వీసు ప్రారంభించనున్నారు. దీనికి అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం ఉంటుందని చెప్పారు. అలాగే ప్రతి రోజూ ఆర్టీసీ బస్టాండ్ నుంచి అనుపల్లెకు వయా న్యూకలెక్టరేట్, ప్రశాంత్ నగర్, తిమ్మసానిపల్లె మీదుగా టౌన్ బస్ సర్వీసును ఎమ్మెల్యే ప్రారంభిస్తారని వివరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు నింద్ర విద్యార్థిని

నింద్ర, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న మోనీషా అండర్-14 నెట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం శివయ్య తెలిపారు. నవంబరు 10 నుంచి 12వ తేదీవరకు వైజాగ్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మోనీషాను పీడీ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.


మోనీషా

మల్లారెడ్డి కండ్రిగకు ఆర్టీసీ సర్వీసు

విజయపురం, అక్టోబరు 24: నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ చొరవతో మల్లారెడ్డి కండ్రిగకు ఆర్టీసీ సర్వీసును సత్యవేడు డిపో మేనేజరు గురువారం ప్రారంభించారు. ప్రజా దర్బార్‌లో కలెక్టరు సుమిత్‌కుమార్‌కు, ఎమ్మెల్యేకు గ్రామస్తులు సమస్యలు తెలియజేశారు. స్పందించిన ఎమ్మెల్యే ఐదేళ్లపాటు నిలిచిన సర్వీసును పునరుద్ధరించారు. టీడీపీ నాయకులు నాదమునిరెడ్డి, వెంకటరామిరెడ్డి, గోవిందరెడ్డి, మునివరాలు, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



నేటినుంచి ఖోఖో పోటీలు ప్రారంభం


స్థానికులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన ప్రవీణ్

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఐరాల మండలం అగరంపల్లె జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం నుంచి ఖోఖో పోటీలు ప్రారంభం కానున్నాయి. గురువారం స్కూల్‌కొచ్చిన ఖోఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నల్లబోతుల ప్రవీణ్ మాట్లాడుతూ.. ఈ పోటీలకు రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి బాలబాలికల జట్లు విచ్చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 25, 26, 27 తేదీల్లో అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు జరుగుతాయన్నారు. చివరి రోజున ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే మురళీ మోహన్ తదితరులు విచ్చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, కాణిపాకం మాజీ సర్పంచ్ మధుసూదనరావు, హరిబాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

మామిడి రైతుకు అండగా ఉండాలి: కలెక్టర్

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మామిడి పూత దశ నుంచి కోత వరకు ఉద్యాన, వ్యవసాయ శాఖల అధికారులు రైతుకు అండగా ఉండాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. గురువారం మ్యాంగో భవన్‌లో మామిడి పంట సస్యరక్షణపై ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. సదస్సులో ఉద్యాన, వ్యవసాయ, ఏపీఎంఐపీ అధికారులు మధుసూదన్‌రెడ్డి, మురళీకృష్ణ, బాలసుబ్రహ్మణ్యం, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

గ్రామీణ రోడ్లకు మహర్దశ



నగరి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ హయాంలోనే గ్రామీణ రోడ్లకు మహర్దశ కలుగుతోందని టీడీపీ నాయకులు సురేష్‌నాయుడు, కృష్ణారెడ్డి, సర్పంచి నందిని తెలిపారు. గురువారం వీకేఆర్ పంచాయతీలోని గుడ్డికండ్రిగలో రూ.8లక్షల వ్యయంతో సిమెంటురోడ్డును ప్రారంభించారు. మణిరెడ్డి, మురళిరెడ్డి, నాగరాజు, గోవిందరెడ్డి, వేణు పాల్గొన్నారు.

రేణుకా భవాని ఆలయంలో పూజలు

పాలసముద్రం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మణిపురం గ్రామంలోని రేణుకా భవాని ఆలయంలో గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు సారె సమర్పించారు. మధ్యాహ్నం భక్తులకు ఆలయ కమిటీ ఛైర్మన్ గోవిందయ్య దంపతులు అన్నదానం చేశారు. తమిళనాడు వాసులు కూడా పాల్గొన్నారు.

ఏవోగా లోకేష్ బాధ్యతల స్వీకరణ

గంగాధరనెల్లూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏవో)గా లోకేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జడ్పీ ఆఫీస్‌లో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికొచ్చారు. కొన్నినెలలుగా ఏవో పోస్ట్ ఖాళీగా ఉన్న విషయం తెలిసిందే.

అష్టమి పూజలు

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కట్టమంచి కులందేశ్వరాలయంలో గురువారం స్వామివారికి భక్తులు అష్టమి పూజలు చేశారు. గిరింపేట శివగామి సుందరి చిదంబరేశ్వర, కామాక్షి అంబికా సమేత అగస్త్యేశ్వరా, నీవానది కాశీ విశ్వేశ్వర (రాజుగుడి), సంతపేట కనకదుర్గ ఆలయాల్లోనూ పూజలు జరిగాయి.

వృద్ధులకు చీరల వితరణ



చిత్తూరు సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా మాజీ కౌన్సిలర్ పార్థసారధినాయుడు గురువారం వృద్ధులకు చీరలు వితరణ చేశారు. అంతకుముందు రాస్ వృద్ధాశ్రమంలో అన్నపూర్ణేశ్వరి దేవికి పూజలు చేశారు. బుద్ధిమాంద్యం పిల్లలకు కేక్‌లు పంచిపెట్టి, అన్నదానం చేశారు. రాస్ కేంద్ర మేనేజర్ ముత్యాల శెట్టి తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులో పరిశీలన



పూతలపట్టు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పి.కొత్తకోట సమీపాన ఉన్న డంపింగ్ యార్డును గురువారం డీపీవో పార్వతి పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ అధికారులకు సూచనలిచ్చారు. సర్పంచ్ పద్మజారాణి, పంచాయతీ కార్యదర్శి డిల్లీబాబు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఇద్దరు లాటరీ విక్రేతల అరెస్టు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో అక్రమంగా లాటరీ టికెట్లను విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులు ఒకటో పట్టణ పోలీసులు పట్టుకున్నారు. సీఐ జయరామయ్య తెలిపిన వివరాల మేరకు.. పాత బస్టాండ్‌లో లాటరీ టికెట్లు విక్రయిస్తున్నారని సమాచారం అందడంతో దాడులు చేశారు. నగరానికి చెందిన రాజా, యాదమరి మండలం రాసూరుకు చెందిన మాణిక్యంలు పాత బస్టాండులో లాటరీ టికెట్లు అమ్ముతున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.4,100 సీజ్ చేసి.. కేసు నమోదు చేశారు.

బావిలో తేలిన వృద్ధుడి శవం

వెదురుకుప్పం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మాంబేడు గ్రామ సమీపంలో ఓ వృద్ధుడి శవం బావిలో తేలడాన్ని స్థానికులు గుర్తించారు. మాంబేడుకు చెందిన సంజీవయ్య(75)కు కొంతకాలంగా మతిస్థిమితం లేదు. మూడ్రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబీకులు ఎంత వెతికినా ఆచూకీ తెలియలేదు. చివరకు గురువారం బావిలో శవమై తేలాడు. మూడ్రోజుల కిందట బావిలో పడిపోవడం వల్ల శవం కుళ్లిపోయినట్లు స్థానికులు తెలిపారు.